MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 22 సంచిక: 8 రంగారెడ్డి ఏప్రిల్ 2024 పేజీలు : 36 వెల : రూ. 10/-

## నాబార్డ్ తెలంగాణా ఎఫ్ పి ఓల 'తరంగ్' దృశ్యం!



## ఏపిమాస్‌లో మహిళా దినోత్సవ సంరంభం !



## చిత్తూరు జిల్లా గోరంట్లపల్లిలో అరబిందో, ఏపిమాస్ ఆధ్వర్యంలో కమ్యూనిటి హాల్ ప్రారంభోత్సవం, మహిళా దినోత్సవం !




అరబిందో ఫార్మా వైస్ ఛైర్మన్ శ్రీ.కె. నిత్యానందరెడ్డి, ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి.ఎస్.రెడ్డి , అన్నమయ్య జిల్లా సామాజిక అటవీ శాఖాధికారి నాగమునీశ్వరి గారు, జిల్లా ఉద్యానశాఖాధికారి శ్రీ రవిచంద్రబాబు, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి శ్రీ గుణశేఖర్ పిళ్ళై తదితరులు

## నాగాలాండ్‌లో ఇ సి ఎస్ సమాఖ్యలపై ఏపిమాస్ అధ్యయనం!





## తెలంగాణా సెర్ప్, మెప్మా అధికారులతో ఏపిమాస్!




NABARD

నాబార్డ్ సౌజన్యంతో ....

# రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్.పి.ఓ)

సహకారమే పునాదిగా సంఘాల బలోపేతం
సేవలే ఆధారంగా ప్రగతి దిశలో రైతుల పయనం

## చేపట్టే పనులు




NABARD

# మహిళా సాధికారత

సంపుటి 22 సంచిక 8




సంపాదకీయం

## కొత్త ఆలోచనలు !

ఒక ఆర్థిక సంవత్సరం ముగిసింది. మరో ఆర్థిక సంవత్సరం మొదలైంది. ఎన్నెన్నో కొత్త ప్రాజెక్టులు రూపుదిద్దుకుని ముందుకు వస్తున్నాయి. అవకాశాలను అందిపుచ్చుకునే వారినే విజయం వరిస్తుంది. మీనమేషాలు లెక్కిస్తూ కూర్చుంటే, అందినట్టే అంది, అందకుండా పోతుంది. ఇది పోటీ ప్రపంచం. ఒక అడుగు ముందుకు వేసే వారికే రెండవ అడుగు వేసే అవకాశం వుంటుంది. 'వెనుకబడితే వెనుకేనోయ్' అన్నారు అభ్యుదయ కవి శ్రీశ్రీ. రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా పిలువబడే ఎఫ్ పి ఓలు లేదా ఎఫ్ పి సిల పాలకవర్గాలు, ముఖ్య కార్యనిర్వహణాధికారులు తమ సంస్థల సుస్థిరాభివృద్ధికోసం, సభ్యుల భవ్యమైన భవితకోసం కొత్త ఆలోచనలతో సరికొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలి. ఆలోచనలకు పదునుపెడితే అవకాశాలు అనంతం! చూడగలిగితే మన చుట్టూ ఎప్పటికప్పుడు ఎంతో కొత్తదనం కనిపిస్తుంది. తాము పొందిన శిక్షణలు , జరిపిన అవగాహన పర్యటనలు కొత్త ఆలోచనలను రేకెత్తించలేకపోతే అవన్నీ వృథా అయినట్టే కదా! ఈ సంచికలోనే నష్టాలు మూటగట్టుకుంటున్న పసుపు రైతుల దుస్థితిని గమనించి, వారిని లాభాల బాట పట్టించాలన్న అంకితభావంతో ఆలోచించి, దేశంలోనే మొదటిసారిగా పసుపు ఆకుల నుంచి విలువైన తైలాన్ని తీసే నూతన ప్రక్రియను ఒక మహిళా స్వయంసహాయ సంఘ (ఎస్ హెచ్ జి) సభ్యులు కనుగొన్న విజయగాథను చూడవచ్చు. మరో మహిళా స్వయం సహాయ సంఘం మొత్తం తమ గ్రామాన్నే సేంద్రియ ఎరువుల వినియోగ క్షేత్రంగా మార్చి, రైతులకు లాభాల కానుకలందిస్తున్నది. వారు బయో గ్యాస్‌ను కూడా తయారుచేసుకుని ఇంధనపు ఖర్చులను తగ్గించుకోగలుగుతున్నారు. ఇలా ఎన్నెన్నో నూతన ఆవిష్కరణలు, ఆదాయ మార్గాలు మన కట్టెదుటే కనిపిస్తాయి. ఎఫ్ పి ఓల నిర్వాహకులు ఇలాంటి విషయాలలో స్వయంసహాయ సంస్థలనుంచి స్ఫూర్తి పొందగలగాలి. తమ కంటె కనీసం ఒక దశాబ్దకాలం ముందున్న ఎస్ హెచ్ జిల నుంచి ఎఫ్ పి ఓలు నేర్చుకోవలసింది ఎంతో వుంది. సంస్థ ఆర్థికాభివృద్ధికి, సభ్యులకు మెరుగైన సేవలను అందించడానికి ఎక్కడెక్కడినుంచి నిధులు సమకూర్చుకోవచ్చునో, ఎన్నెన్ని రకాల రుణాలు పొందవచ్చునోకూడా ఎస్ హెచ్ జిలు పాఠాలు నేర్పుతాయి. అనేక కార్పొరేట్ కంపెనీలు తమ 'సామాజిక బాధ్యత' (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి … సి ఎస్ ఆర్ ) లో భాగంగా సమాజాభివృద్ధి కార్యక్రమాలకు తిరిగి చెల్లించనవసరంలేని గ్రాంట్లుగా నిధులు సమకూరుస్తుంటాయి. అటువంటి నిధులకోసం అన్వేషించడానికి ఇదే సరైన తరుణం! కొత్త ఆర్థిక సంవత్సరం యిప్పుడే మొదలవుతున్నది కాబట్టి వారి సి ఎస్ ఆర్ నిధుల కోటా నిండుగా వుంటుంది. ఇక ప్రగతి ప్రస్థానం అవసరాన్ని బట్టి రుణాలను కూడా పొందగలగాలి. 'అప్పు ముప్పు' అన్నది ఒకనాటి మాట. 'అప్పుతోనే అభివృద్ధి' అనేది నేటి బాట! పరిమిత నిధులతో ప్రగతి కూడా పరిమితంగానే వుంటుంది. మరింతగా, మరిన్ని ముందడుగులు వేయాలంటే సవ్యమైన రుణాలు అవసరమే! కావలసింది ఆర్థిక క్రమశిక్షణ. అవసరానికి అనుగుణంగా అప్పు తెచ్చుకోవాలి, దానిని నిర్దిష్ట ప్రయోజనానికే ఉపయోగించాలి, కాలాతీతం కాకుండా అప్పు తీర్చాలి. ఇలా ఆర్థిక క్రమశిక్షణతో వ్యవహరించేవారికి అప్పు యివ్వడానికి ముందుకు వచ్చే బ్యాంకులు, ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థలు ఎన్నో వుంటాయి. అయితే, నిధులను సమకూర్చుకోవడంతోనే సరిపెట్టకుండా ముందే అనుకున్నట్టు వ్యాపారాత్మకంగా సరికొత్త ఆలోచనలతో తమ సంస్థలకు ఆర్థిక పరిపుష్టి చేకూర్చాలి. ఏ కారణాలవల్ల రైతులు నష్టాలపాలవుతున్నారో తెలుసుకుని, నష్ట నివారణ చర్యలు చేపట్టగలగాలి. ఆదాయం పెంపుదల మార్గాలను అన్వేషించాలి. తమకు మేలు జరిగితే సభ్య రైతులకు ఎఫ్ పి ఓ మీద నమ్మకం పెరుగుతుంది. అప్పుడు మిగతా రైతులు కూడా ఎఫ్ పి ఓ లలో చేరడానికి ముందుకు వస్తారు. సభ్యుల సంఖ్య ఎంతగా పెరిగితే సంస్థ అంతగా బలపడుతుంది. ఒక్క సదాలోచన ఎందరి జీవితాలలోనో వెలుగులు నింపవచ్చు. ఆలోచించండి. విజయ గాథలలో మీ సంస్థకూ స్థానం కల్పించండి !




Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:**T.**Chandra Sekhar Reddy**


పొరపాటు చేశారని చిన్నచూపు చూడకు ... నీ పొరపాట్ల మాట గుర్తు తెచ్చుకో

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఎల్. భవాని, జి. దివ్యశ్రీ, ఎం. భార్గవి, జి. శ్రీనివాస్, ఎస్. ప్రహ్లాదయ్య

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు

సమన్వయ సహకారం : పి. ఝాన్సీ లక్ష్మి

## లోపలి పేజీలలో ....

➪ నాగాలాండ్‌లో ఎస్‌హెచ్‌జి ల అధ్యయనం 05
➪ గోరంట్లపల్లిలో మహిళా దినోత్సవ వేడుకలు 07
➪ జన్మభూమి సేవలో తరిస్తున్న నిత్యానందరెడ్డి ! 09
➪ నాబార్డ్ తెలంగాణా 'తరంగ్' దృశ్యమాలిక ! 10
➪ వాష్ ప్రాజెక్ట్‌చే ప్రపంచ జల దినోత్సవం! 12
➪ డ్రోన్ పైలెట్లుగా స్వయం సహాయ మహిళలు 14
➪ పట్టణ పోషణ... మహిళా దినోత్సవం 15
➪ 'వెలుగు'లు నింపిన సంఘాలు ! 16
➪ సంఘాల పునరుజ్జీవానికి 'మహిళా శక్తి' ! 18
➪ రిలయన్స్ ఎఫ్‌పిఓల సిబ్బందికి ఏపిమాస్ శిక్షణ 21
➪ పసుపు ఆకులతో పసిడి తైలం ! 22
➪ లాభదాయక వ్యవసాయానికి భూసార పరీక్షలు 24
➪ మహిళా ఉద్యోగులకు అదనపు సెలవులు 25
➪ భావజాలం ముఖ్యంకాదు స్పందించడం ప్రధానం 26
➪ 'సేంద్రియ' కాంతులతో వెలుగుతున్న గ్రామం 28
➪ ఎండాకాలంలలో పెరుగు కంటె మజ్జిగ మేలు! 30
➪ లిల్లీ పూలతో లక్షలు సంపాదిస్తోంది! 31
➪వ్యవసాయ సొసైటీలో స్వాహాపర్వం! 32
➪ ఈ ఆవు ఖరీదెంతో తెలుసా? రూ.40 కోట్లు 34

### 'మహిళాభివృద్ధి సొసైటీ' (ఏపిమాస్)

'**మ**హిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశంలోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.

| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన చార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org

**దురాగతాలు చేసే వారికంటె ఉలుకుపలుకు లేకుండా వుండేవారి వల్లనే మరింత చేటు**

# నాగాలాండ్‌లో ఎస్ హెచ్ జి సంస్థల అధ్యయనం!

– జి.శ్రీనివాస్




నాగాలాండ్‌లోని 'ఈలుతోరోస్ క్రిస్టియన్ సొసైటి' (ఇ సి ఎస్) నిర్వహిస్తున్న ఎస్ హెచ్ జి లు, వాటి సమాఖ్యల పనితీరు, వాటి మెరుగుదలకు తీసుకోవలసిన చర్యలపై ఇద్దరు సభ్యుల ఏపిమాస్ బృందం 2024 మార్చి 24 నుండి 28 తేదీల మధ్య మూడురోజులపాటు అధ్యయనం జరిపింది. ఏపిమాస్ సి ఇ ఓ, ఎం డి శ్రీ సి ఎస్ రెడ్డి , ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీ జి. శ్రీనివాస్ ఈ అధ్యయనం నిర్వహించారు.

గతంలో ఇ సి ఎస్ బృందం తెలంగాణాలోని స్వయంసహాయ సంఘాలను, స్వయంసహాయ సమాఖ్యలను సందర్శించింది. ఈ పర్యటనను ఏపిమాస్ నిర్వహించింది. ఆ అనుభవంతో నాగాలాండ్‌లో తమ సంస్థ నిర్వహిస్తున్న ఎస్ హెచ్ జి లు, వాటి సమాఖ్యల పనితీరును పరిశీలించి, వాటి మెరుగుదలకు సూచనలు చేయవలసిందిగా ఇసిఎస్ చేసిన ఆహ్వానం మేరకు ఏపిమాస్ ద్విసభ్య బృందం మూడురోజులపాటు నాగాలాండ్‌లోని ట్వేన్సంగ్ జిల్లాలో పర్యటించి, ఇ సి ఎస్ నిర్వహణ లోని ఎస్ హెచ్ జిలు, వాటి సమాఖ్యల పనితీరును, సానుకూల, ప్రతికూలాలను గమనించారు.

మూడు రోజుల సందర్శనలో భాగంగా మొదటి రెండు రోజులు స్వయం సహాయ సంఘాలను, సమాఖ్యలను వారు చేయు కార్యక్రమాలను అధ్యయనం చేయటం జరిగింది. కొండలు, గుట్టల మధ్య నివాసం ఉంటున్న ప్రజలతో



దుర్వినియోగం తీరని ద్రోహం , నీవు వేటిని వ్యర్థం చేస్తున్నావో అవి లేక కుమిలిపోతున్న వారెందరో !



ఈ.సి.యస్ సంస్థ వారు సంఘాలను ఏర్పాటు చేశారు. ఇందులో మహిళా సంఘాలు ఉన్నాయి. పురుషులతో కూడా సంఘాలు ఏర్పాటు చేశారు. ఈ సంఘాల సభ్యులు పొదుపులు చేస్తున్నారు. అప్పులు తీసుకుంటున్నారు. ఈ సంఘాలన్నీ కలిసి సమాఖ్యలను కూడా ఏర్పాటు చేసు కున్నాయి. సమాఖ్య ద్వారా అప్పులు తీసుకుంటున్నారు. పుస్తక నిర్వహణ విషయానికొస్తే సంఘంలో చదువుకున్న సభ్యులే ఒక పుస్తకంలో రాస్తున్నారు. కాని, అన్ని వివరాలను నమోదు చేయటం లేదు. వారికి పూర్తిస్థాయిలో శిక్షణ యిస్తే వారు సక్రమంగా రాయగలుగుతారు. సంఘాలకు, సమాఖ్య లకు నిర్వహణ విషయంపై శిక్షణ అవసరం ఉంది.

మూడవ రోజున ఈలుతోరోస్ క్రిస్టియన్ సొసైటీ (ఇ సి ఎస్) సిబ్బందితో కార్యశాలను నిర్వహించటం జరిగింది.



ఈ కార్యశాలకు ఇసిఎస్ సెక్రటరీ డా.చింగ్‌మాక్, ఇ సి ఎస్ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు రోజుల పాటు సందర్శనలో గమనించిన అంశాలను, సంస్థల బలోపేతంకోసం తీసుకోవలసిన చర్యలపై కార్యశాలలో వివరించటం జరిగింది. శ్రీ.సి.యస్ రెడ్డి వారి అపార అనుభవంతో సంస్థల బలోపేతం కోసం చేయవలసిన కార్యక్రమాలపై వారికి అవగాహన కల్పించారు.

కార్యశాల చివరలో ఇ సి ఎస్ సెక్రటరీ డా.చింగ్ మాక్, వారి బృందం సభ్యులు మాట్లాడుతూ ఏపిమాస్ అధ్యయనంలో వెల్లడైన అంశాలపై ఇ సి ఎస్ చర్యలు తీసుకుంటుందని, సంస్థల బలోపేతం కోసం ఏపిమాస్ సాంకేతిక సహకారం అందించాలని కోరారు.

ఏపిమాస్ టీం వచ్చి తమ సంస్థలను సందర్శించి, అధ్యయనం చేసి తగు సలహాలు సూచనలు ఇచ్చినందుకు శ్రీ సి.యస్ రెడ్డి , శ్రీ జి.శ్రీనివాస్ బృందానికి ధన్యవాదాలు తెలిపారు.

దీనితోపాటు ట్వేన్సంగ్ జిల్లాలోని యస్ ఆర్ యల్ యం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్‌తో, జిల్లా స్థాయి సిబ్బందితో సమావేశమై జిల్లాలోని సంఘాల, సమాఖ్యల స్థితిగతుల గురించి తెలుసుకోవటం జరిగింది.

ఇ సి ఎస్, యస్ ఆర్ యల్ యం సంయుక్తంగా జిల్లాలోని సంఘాల, సమాఖ్యల అభివృద్ధికోసం కృషి చేయాలని ఏపిమాస్ బృందం వారిని కోరింది. ■

# గోరంట్లపల్లిలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

– డా.భార్గవి

**అ**న్నమయ్య జిల్లా కె.వి.పల్లి మండలం గోరంట్లపల్లిలో ఏపిమాస్, అరబిందో ఫార్మా ఫౌండేషన్ సంయుక్త అధ్వర్యంలో 2024 మార్చి 7వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని, కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరబిందో ఫార్మా మేనేజింగ్ డైరెక్టర్, వైస్ ఛైర్మన్ శ్రీ కె.నిత్యానందరెడ్డి, ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి, అన్నమయ్య జిల్లా సామాజిక అటవీ శాఖాధికారి నాగమునీశ్వరి గారు, జిల్లా ఉద్యానశాఖాధికారి శ్రీ రవిచంద్రబాబు, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి శ్రీ గుణశేఖర్ పిళ్ళై తదితర ప్రముఖులు పాల్గొన్నారు.





వీరితో పాటు పీలేరు, కె.వి.పల్లి మండలాలలోని వివిధ శాఖల అధికారులు, పీలేరు, కె.వి.పల్లి, కలకడ, కలికిరి, సదుం, సోమల, నిమ్మనపల్లి, చౌడేపల్లి, గుర్రంకొండ, మదనపల్లి మండలాలలోని రైతులు, మహిళలు మొత్తం 500 మంది పాల్గొన్నారు.

**కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం**

కె వి పల్లి మండలంలోని గ్రామాల ప్రజలకు ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాల్‌ను అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో, శ్రీ నిత్యానందరెడ్డి ప్రోత్సాహంతో ఏపిమాస్ నిర్మించింది. ఆ రోజు తొలుత ఆ కమ్యూనిటీ హాలు ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు.

**రక్తదాన, కంటి పరీక్షా శిబిరాలు**

మార్చి 7వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని, అదేరోజు అక్కడ రక్తదాన శిబిరాన్ని, ఉచిత కంటిపరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. రక్తదాన శిబిరంలో 25 మంది రక్తదానం చేశారు. పీలేరులోని డా. మౌర్య ఆస్పత్రి కంటి వైద్య నిపుణులు 81 మంది రైతులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీచేశారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశం ప్రారంభంలో ఏపిమాస్ సంచాలకులు శ్రీ వినాయకరెడ్డి, ఏపిమాస్ ప్రాజెక్టు మేనేజర్ డా.భార్గవి ఆహ్వానితులకు స్వాగతం పలుకగా వారు జ్యోతి ప్రజ్వలన చేసి, తమ సందేశాలను వినిపించారు.

**ప్రకృతి వ్యవసాయం ప్రధాన కర్తవ్యం**

తొలుత ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని వివరిస్తూ, ప్రకృతి వ్యవసాయంపై దృష్టి కేంద్రీకరించాలని రైతులను, వ్యవసాయాధికారులను కోరారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ఎఫ్ పి ఓ లలో ( రైతు ఉత్పత్తిదారుల సంస్థలలో)మహిళల సంఖ్య, వారి పాత్ర ఎక్కువగా వుండాలని అన్నారు. అవగాహన లోపం కారణంగా వ్యవసాయ ఉత్పత్తులను నష్టాలకు అమ్ముకోవడం పరిపాటిగా మారిందని, ఎఫ్ పి ఓల ద్వారా అమ్మకాలు జరిగితే మంచి లాభాలను పొందవచ్చునని వివరించారు.

అన్నమయ్య జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీ రవిచంద్ర బాబు వ్యవసాయంలో మహిళల పాత్ర గురించి, వివిధ

నిన్ను పదేపదే వేధించే వారివల్ల నీ ఆత్మబలం పెరుగుతున్నట్టు , వారి బలం క్షీణిస్తున్నట్టు



ఉద్యాన పంటలలో సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు.

అదే విధంగా అన్నమయ్య జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి శ్రీ గుణశేఖర్ పిళ్ళై మాట్లాడుతూ, అన్నమయ్య జిల్లాలో రైతులు ఎక్కువగా పాడి రంగం మీద ఆధారపడి వున్నారని, పాడి రంగంలో మహిళల పాత్ర ఎక్కువగా ఉందని, పాడి రైతుల ప్రయోజనంకోసం పశు సంవర్ధక శాఖ వివిధ పథకాలను అందిస్తున్నదని వివరించారు. జిల్లాలోని సంబంధిత అన్ని శాఖల అధికారులు ఏపిమాస్ చేపడుతున్న కార్యక్రమాలను కొనియాడుతూ, భవిషత్తులో కూడా కలిసి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

సేంద్రియ పద్ధతులతో సాగు చేసిన ఉత్పత్తులకు మార్కెట్‌లో అధిక డిమాండు ఉందని జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బోదేషావలి తెలిపారు. ఈ ఏడాది సేంద్రియ విధానంలో పండించిన మామిడికి రెండింతల ధర లభించిందని ఆయన చెప్పారు. రైతులకు గిట్టుబాటు ధర లభించి అధిక ఆధాయం పొందాలంటే సేంద్రియ సాగు విధానాలు అనుసరించాలన్నారు. దీనితో పెట్టుబడులు కూడా గణనీయంగా తగ్గుతాయన్నారు.

మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలను ప్రోత్సహిస్తూ ఉత్తమ మహిళా రైతులను, పీలేరు మండలం లోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఉత్తమ విద్యార్ధినుల ను సన్మానించారు. 400 మంది మహిళలకు ఉచితంగా ఒక్కొక్కరికి 5 కిలోల మొక్కజొన్న , జొన్న గడ్డి విత్తనాలను పంపిణీ చేశారు. అదే విధంగా 6 గడ్డి కత్తిరించే యంత్రాలను, 3 పాలుపితికే యంత్రాలను, 10 మంది ఒంటరి మహిళలకు పెయ్య దూడలను, 10 మంది రైతులకు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను, నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు.

వివిధ శాఖల జిల్లా , మండల స్థాయి అధికారులను సన్మానించడంతో సమావేశం విజయవంతంగా ముగిసింది. ■








ప్రగతికి పునాది నమ్మకం కాదు, సందేహం

# జన్మభూమి సేవలో తరిస్తున్న నిత్యానందరెడ్డి !

ఫార్మా రంగంలో దేశంలోనే అగ్రగామి సంస్థల్లో ఒకటిగా రాణిస్తున్న అరబిందో ఫార్మాస్యూటికల్స్ సంస్థ అధినేతలలో ఒకరైన శ్రీ నిత్యానందరెడ్డి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కేవీపల్లె మండలంలో మారుమూల గ్రామమైన గోరంట్లపల్లెలో జన్మించారు. ఎన్నో ఒడిదుడుకులను, కష్టనష్టాలను ఎదుర్కొని నేడింతటి ఉన్నతస్థితికి ఎదిగారు. ఎంత ఎత్తుకు ఎదిగినా మూలాలు మరిచి పోకూడదన్న సద్భావనతో తాను పుట్టిన ప్రాంతాన్ని, తన ప్రాంతంలోని ప్రజలను ఆదుకోవాలని, వారి సమగ్రాభివృద్ధికి తనవంతుగా ఏదైనా చేయాలన్న తలంపుతో ఆయన సాగిస్తున్న సామాజిక సేవ ఆదర్శ ప్రాయం.



తన సంస్థ 'కార్పొరేట్ సామాజిక బాధ్యత'లో భాగంగా ఏపిమాస్‌తో సంయుక్తంగా, ఇతరత్రా పీలేరు ప్రాంతంలోని రైతాంగానికి అనేక సేవా కార్యక్రమాలను ఆయన నిర్వహిస్తున్నారు.

2024 మార్చి 7 వ తేదీన ఏపిమాస్‌తో సహ భాగస్వామ్యంలో గోరంట్లపల్లెలో ప్రారంభించిన కమ్యూనిటి హాల్ ఆయన ప్రోత్సాహంతో, అరబిందో ఆర్థిక సహాయంతో నిర్మించినదే ! ఈ ఇంతమాత్రమే కాదు, ఈ ప్రాంతానికి, ఈ ప్రాంత ప్రజలకు ఆయన చేసిన, చేస్తున్న సేవలు అనేకం.

**ఆయన సామాజిక సేవా కార్యక్రమాల్లో కొన్ని...**

**1. గడ్డి కత్తిరించే యంత్రాలు :** 2021 మార్చి 10వ తేదీన పాడి రైతులకు గడ్డి కత్తిరించే యంత్రాలను నిత్యానంద రెడ్డి పంపిణీ చేశారు.

**2. పెరటి కోళ్ల పెంపకం :** కలికిరి కేవీకేలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 90 మంది మహిళలకు 45 రోజుల కోడిపిల్లలను ఒక్కొక్కరికి 20 చొప్పున పంపిణీ చేశారు.

**3. పెయ్య దూడలు, పొట్టేళ్ల పంపిణీ :** అనుబంధ జీవనోపాధుల పెంపుదల కార్యక్రమంలో భాగంగా ఐదుగురు ఒంటరి మహిళలకు పెయ్యదూడలు, ముగ్గురు ఒంటరి మహిళలకు పొట్టేలు పిల్లలను పంపిణీ చేశారు.

**4. సూపర్ నేపియర్ గడ్డి :** 2019లో వచ్చిన కరువును దృష్టిలో పెట్టుకుని 2020, 2021 సంవత్సరాల్లో 300 మంది పాడి రైతులకు సూపర్ నేపియర్ పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేశారు. వేసవిలో మొక్కజొన్న, జొన్న విత్తనాలను 520 మంది రైతులకు పంపిణీ చేయడం జరిగింది.

కొత్త రకం గడ్డి స్మార్ట్ నేపియర్, దశరథ గడ్డి విత్తనాన్ని పీలేరు, దాని చుట్టుపక్కల మండలా ల్లోని పాడి రైతులకు అందుబాటు లోకి తెచ్చారు.

**5. పశువైద్య శిబిరాలు :** 2020 నుంచి పీలేరు, కేవీపల్లె, కలికిరి మండలాల్లోని గ్రామాలలో ఉచిత పశువైద్య ద్వారా శిబిరాలను ఏర్పాటు చేసి పశువైద్యాధికారుల ద్వారా చికిత్స అందిస్తూ ఉచితంగా నట్టల, పిడుదుల నివారణ మందును పంపిణీ చేయించారు. కట్టని అప్పులకు చికిత్స అందించారు. ఇలా 12 వేల పశు వులకు చికిత్స అందించారు.

**6. పెరటి తోటల పెంపకం:** పెరటి తోటల పెంపకం కింద 700 మంది కుటుంబాలకు 15 రకాల కూరగాయలు, ఆకుకూర విత్తనాలను సరఫరా చేయించారు.

**7. పొలం గట్లపై చెట్ల పెంపకం:** 550 మంది రైతులకు పొలం గట్లపై పెంపకానికి పండ్ల చెట్లను పంపిణీ చేశారు.

(మిగతా 20వ పేజీలో ...)

సమయం మించిపోలేదులే అనుకుంటూనే సమయం మించి పోవడం అసలు సమస్య

# నాబార్డ్ తెలంగాణా 'తరంగ్' దృశ్యమాలిక !







పుస్తకాలు లేని గది ఆత్మలేని శరీరం లాంటిది








నీకే కాదు నీ శత్రువుకూ స్వేచ్ఛ అవసరమే ; లేకుంటే నీ స్వేచ్ఛకు ప్రమాదం పొంచి వున్నట్టే

# వాష్ ప్రాజెక్ట్‌చే ప్రపంచ జల దినోత్సవం!

– శ్రీనివాస్ కరి




పత్తికొండలో జల దినోత్సవం

ప్రపంచ జల దినోత్సవం (మార్చి 22 వ తేదీ) సందర్భంగా వాష్ ప్రాజెక్ట్ ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ రాష్ట్రాలలో ప్రాజెక్ట్ అమలు జరుగుతున్న జిల్లాలలోని సంబంధిత మెప్మా , సెర్ప్ సిబ్బందితో కలిసి నీటి వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా మెప్మాకు చెందిన రిసోర్స్ పర్సన్స్ , సెర్ప్‌కు చెందిన వి ఓ ఏ లకు ప్రపంచ జల దినోత్సవం ఆవశ్యకతను, 2024వ సంవత్సర జల దినోత్సవ నినాదాన్ని (వాటర్ ఫర్ పీస్) వివరించి, నీటి వనరులను పరిరక్షించడంలో సామాజిక బాధ్యతను గుర్తు చేశారు. అందుకోసం ప్రతి కుటుంబం అవలంబించవలసిన పద్ధతులను ముఖ్యంగా ఇంకుడు గుంతలు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు (రూఫ్ టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్) మొదలైన అంశాలు వివరించి, వారి సందేహాలను తీర్చారు.

**జల దినోత్సవం పూర్వాపరాలు**

ఐక్యరాజ్యసమితి సూచన మేరకు 1993వ సంవత్సరంలో మొదలై, ప్రతి సంవత్సరం మార్చి నెల 22వ తేదీన ప్రపంచ దేశాలన్నీ ఏటా ఒక కొత్త నినాదంతో ప్రపంచ జల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాయి. 2024వ సంవత్సరానికి "శాంతి కోసం నీరు (వాటర్ ఫర్ పీస్) అనే నినాదంతో జల దినోత్సవాన్ని జరుపుకున్నాయి.

**ఈ నినాదం ప్రత్యేకతలు:**

- నీరు శాంతిని నెలకొల్పుతుంది. నీరే లేకుంటే సంఘర్షణలకు దారి తీస్తుంది.
- నీటి ఎద్దడి లేదా జల కాలుష్యం, నీటి అసమాన పంపిణి లేదా నీరు అందుబాటులో లేని సందర్భాలు ప్రజల మధ్య, దేశాల మధ్య ఉద్రిక్తతలకు దారి తీయవచ్చు,
- వాతావరణ మార్పు ప్రభావం అధికమవుతున్న ప్రస్తుత తరుణంలో, ప్రకృతి మనకు ప్రసాదించిన అపురూపమైన నీటి వనరులను కాపాడుకోవడానికి వివిధ దేశాలు, పౌరులు ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా వుంది.
- పేదరికాన్ని , వాతావరణ క్షీణతను నివారించడంలో నీరు చాలా ముఖ్య పాత్ర పోషిస్తుంది.
- నీటికి సంబంధించిన శాంతియుత సహకారం యితర రంగాలలో శాంతియుత సహకారానికి తోడ్పడుతుంది.


పెద్దపల్లిలో జల దినోత్సవ సమావేశం

- సుసంపన్నమైన సుస్థిర భవిష్యత్తుకోసం అందరం జల రంగంలో శాంతియుత సహకారానికి కృషి చెయ్యాలి.

**నీటికి సంబంధించిన కీలక సత్యాలు**

- ప్రపంచంలోని 300 కోట్ల పైగా జనాభా వారి దేశ సరిహద్దులకు ఆవలి జల వనరులపై ఆధారపడి జీవిస్తున్నారు. పొరుగు దేశాలతో నదులు, సరస్సులు, యితర జలవనరులను పంచుకుంటున్న 153 దేశాలలో కేవలం 24 దేశాలు మాత్రమే నీటి పంపిణీ ఒడంబడికలు కలిగివున్నాయి.
- ప్రపంచంలో 220 కోట్ల మంది ప్రజలు ఇప్పటికీ సురక్షితం కాని నీటితో జీవిస్తున్నారు.
- భూమిమీద ఉన్న మొత్తంనీటిలో, కేవలం 0.5% మాత్రమే మానవ వినియోగానికి పనికి వచ్చేవి, అందుబాటులో వున్నవి, సురక్షితమైనవి.
- లభ్యమయ్యే మంచినీటిలో దాదాపు 72% నీటిని వ్యవసాయానికి ఉపయోగిస్తుండడంవల్ల వాతావరణ మార్పు, జనాభా పెరుగు దల, నీటి ఎద్దడి వంటి కారణాలు ఆహార పంపిణీ మీద ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి




- నీరు, పారిశుధ్య రంగాలలో పెట్టే ఖర్చు తో పోలిస్తే, ఆరోగ్యం, ఉత్పాద కత, పర్యా వరణం, సామాజిక ఫలితాల విషయంలో అపరిమిత ప్రయోజనాలు చేకూరుతాయి.

అందువల్ల ఈ అంశాలన్నిటిని దృష్టిలో ఉంచుకుని, నీటి వనరులను పరి రక్షించడంలో మనవంతు బాధ్యతను నిర్వర్తించి భావి తరాల అభివృద్ధికి తోడ్పడదాం. ■

క్షమాపణ చెప్పడం అంటే తప్పు చేసినట్టు ఒప్పుకోవడం కాకపోవచ్చు , స్నేహబంధాన్ని గౌరవించడం కావచ్చు

# డ్రోన్ పైలెట్లుగా స్వయం సహాయ మహిళలు !

– బి.మధుసూదన్ రెడ్డి



స్వయంసహాయ సంఘాలకు చెందిన 15వేల మంది మహిళలను డ్రోన్ పైలట్లుగా తీర్చిదిద్దాలనే ఆశయంతో 2023 నవంబర్ 28న కేంద్ర ప్రభుత్వం 'నమో డ్రోన్ దీదీ' పథకాన్ని ప్రకటించింది. మధ్యంతర బడ్జెట్లో దీని కోసం రూ. 500 కోట్లు కూడా కేటాయించింది.

ఈ పథకం కింద కేంద్రప్రభుత్వం డ్రోన్లు అద్దెకిస్తుంది. డ్రోన్లతో వ్యవసాయ పనులు పని త్వరగా పూర్తవుతాయి. 10 మంది రైతులు చేసే పనిని అంతే సమయంలో ఒకే డ్రోన్ చేయగలదు. పొలంలోకి రైతులు వెళ్లాల్సిన అవసరం లేకుండానే పని పూర్తవుతుంది. డ్రోన్ల ద్వారా పురుగు మందులను పిచికారీ చెయ్యడం ద్వారా మనుషులపై పురుగు మందుల దుష్ప్రభావాలను నియంత్రించవచ్చు. అధిక మందుల వినియోగాన్ని తగ్గించవచ్చు. డ్రోన్ల ద్వారా పురుగుమందులను, ద్రవఎరువులను చల్లడంవల్ల రైతులకు శ్రమ తగ్గుతుంది.

డ్రోన్లను ఆపరేట్ చేసేందుకు ప్రముఖ ఎరువుల కంపెనీ 'కోరమండల్ ఇంటర్నేషనల్ ' వారు ఏపిమాస్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఎఫ్‌పిఓల ద్వారా చిత్తూరు , అన్నమయ్య జిల్లాల నుంచి 8 మంది అర్హులైన స్వయంసహాయ మహిళలను గుర్తించి వారికి రెండు దఫాలుగా శిక్షణ ఇవ్వడం జరిగింది. చక్కగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి "డ్రోన్ పైలెట్"గా సర్టిఫికెట్స్‌ను అందించడం జరిగింది.

ఈ డ్రోన్ పైలట్లకు ఒక్కొక్కరికి సుమారు 10 లక్షల విలువ కలిగిన డ్రోన్ యూనిట్‌ను 28.03. 2024న కోరమండల్ ఇంటర్నేషనల్ కంపెనీ వారు ఏపిమాస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ.వినాయక రెడ్డి, యం–టమాట ఎఫ్‌పిసి అధ్యక్షురాలు శ్రీమతి సంధ్యశ్రీ ద్వారా అందించారు.

వీరు తమ ప్రాంతాల్లోని రైతులకు డ్రోన్ల ద్వారా పొలాల్లో అద్దెకు పురుగు మందులను పిచికారి చేసి ఈ గ్రామీణ స్వయంసహాయ మహిళలు తమ కుటుంబ ఆదాయాన్ని పెంచుకొని ఆర్థికాభివృద్ధి పొందే అవకాశం ఉంటుంది. నమో డ్రోన్ దీదీ పథకం గ్రామీణ మహిళలకు సాధికారత కల్పించడమే కాకుండా డ్రోన్ తయారీ, పైలటింగ్, మెకానిక్స్, స్పేర్–పార్ట్ డీలర్‌షిప్‌లలో యువతకు ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తుంది. ■

| ఎస్‌హెచ్‌జి పేరు | పొందినవారి పేరు | కాంటాక్ట్ నం. | గ్రామం |
|---|---|---|---|
| ధనలక్ష్మి ఎస్‌హెచ్‌జి | ఎల్. కుమారి విజయ | 9396571749 | గంగినాయనపల్లి |
| శ్రీదుర్గాదేవి మహిళాసంఘం | ఆర్. పవన | 9618903512 | వేలుమంద |
| శ్రీశక్తి ఎస్‌హెచ్‌జి | కుంట్లపల్లి నవీత | 9886703939 | కొల్లబైలు |
| ప్రగతి ఎస్‌హెచ్‌జి | కె. జ్యోతి | 93922386967 | పత్రవారిపల్లి |
| శ్రీకృష్ణ | రాంపిచర్ల భార్గవి | 9640917830 | అనికిశెట్టిపల్లి |
| శ్రీ షిరిడీసాయి ఎస్‌హెచ్‌జి | ఎస్. పవిత్ర | 9676212828 | కోటవారిపల్లి |
| వెంకటేశ్వర మహిళాగ్రూప్ | వి. రేణుకాబాయి | 7993951730 | గోసులకురవపల్లి |
| ధనలక్ష్మి | జి. లత | 7013989232 | కృష్ణపురం |

నీ భవిష్యత్తుకు రూపుదిద్దేది నీ నిర్ణయాలే సుమా !

# పట్టణ పోషణ, ఆరోగ్య పథకంచే మహిళా దినోత్సవం

– వి. ప్రగతి



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణ పోషణ, ఆరోగ్య పథకం బృందం హైదరాబాదు కార్వాన్ సర్కిల్ పరిధిలోని కృష్ణభవన్‌లో సంబరాలు నిర్వహించారు. ముందుగా ప్రార్ధనతో ప్రారంభించి మహిళా దినోత్సవ ప్రాముఖ్యత గురించి చర్చ జరిగింది.

అనంతరం మహిళలు ఉన్నత స్థాయికి చేరుకోవడానికి వారికి ఏ విధంగా సమాజం సహాయ సహకారాలు అందించాలో, అన్ని రంగాల్లో వారు పాల్గొనడానికి ఎలాంటి తోడ్పాటు వారికి అవసరమో, ఆహార భద్రత, ఆర్థిక స్వేచ్ఛ, తమ స్వంత ఆరోగ్యపరమైన విషయాల్లో మహిళల స్వంత నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సహించడం వంటి విషయాలు చర్చకు వచ్చాయి. ఇవే కాకుండా మహిళలు వారి కుటుంబ పోషణను పెంపొందించుకోవడానికి ఎలాంటి విషయాల్లో అవగాహన అవసరమో వివరించడం జరిగింది.

ఏపిమాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి రామలక్ష్మి మాట్లాడుతూ స్వయం సహాయ బృందాలు మహిళల అభ్యున్నతికి ఏ విధంగా తోడ్పడతాయో వివరిస్తూ మహిళల ఆర్థికాభివృద్ధి ప్రాముఖ్యత, విద్య, ఆర్థిక స్థిరత్వం , ఆరోగ్యం గురించి కూడా అవగాహన కలిగించారు.

సఖి ఫౌండేషన్ నుంచి శ్రీమతి అనిత మాట్లాడుతూ వారి సంస్థ మహిళల అభివృద్ధి కోసం ఏ విధమైన సౌకర్యాలు కల్పిస్తున్నారో వివరిస్తూ అందులో భాగంగా నిర్వహించే రెస్క్యూ కార్య కలాపాలు, వైద్య సౌకర్యాలు, కౌన్సెలింగ్ సౌకర్యాల కల్పన, పోక్సో కేసులపరిశీలన గురించి వివరించి, కమ్యూనిటీలో అందరికీ ఈ విషయాలు వివరించాలని తెలిపారు.

కిమ్స్ ఆసుపత్రి నుండి పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ భవానీ దీప్తి మాట్లాడుతూ శిశువు, తల్లి ఆరోగ్యం ప్రాముఖ్యత గురించి వివరించారు. చనుబాలిచ్చే సమయంలో తల్లి మానసికంగా ప్రశాంతంగా (ఒత్తిడి లేకుండా ) ఉండాలని తెలిపారు.

తర్వాత ఏపిమాస్ ప్రాజెక్ట్ మేనేజర్ లిఖిత ఆహార భద్రత గురించి మాట్లాడుతూ వ్యవసాయంలో మహిళా రైతుల ప్రధాన పాత్ర, పోషకాహారం ప్రాముఖ్యత, పెరటి తోటలలో కూరగాయల పెంపకం ద్వారా సురక్షితమైన ఆహారం తీసుకోవడం గురించి రైతులకు , సంఘ సభ్యులకు అవగాహన కల్పించడం ఎంత అవసరమో వివరించారు.

అనంతరం మహిళలను ప్రోత్సహించేలా కొన్ని ఉత్సాహకరమైన ఆటలను నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో యింకా సి డి పి ఓ రేణుక, డి పి ఓ లలిత కుమారి, వంశీ, టి.ఏల్.ఎఫ్, ప్రెసిడెంట్ శశికళ, ఏపిమాస్ ప్రాజెక్ట్ మేనేజర్ భవాని, ప్రాజెక్ట్ సిబ్బంది, స్వయం సహాయ సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. ■

చుట్టూ చూడగలిగినవారు కలలు కంటారు , తమ గుండె లోతులు చూడగలిగినవారు మేల్కొంటారు

# మహిళల జీవితాలలో 'వెలుగు'లు నింపిన సంఘాలు !

-ఎస్. ప్రహల్లాద

గ్రామీణ ప్రాంతాలలోని పేద కుటుంబాలలోని మహిళలందరిని సంఘటిత యాజమాన్యంలో పనిచేసే స్వయంసహాయ సంఘాలలో (ఎస్ హెచ్ జి లలో) చేర్చి, వారి సమస్యలను వారే చర్చించి పరిష్కార మార్గాలను ఎంచు కొని పేదరికం నుండి బయటకు తేవాలన్న కృతలక్ష్యంతో ప్రపంచ బ్యాంక్ వారి ఆర్థిక సహాయంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'వెలుగు' పథకం పేరుతో 2000 సంవత్సరంలో స్వయం సహాయ ఉద్యమానికి నాంది పలికింది. అప్పటినుండి



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతి గ్రామంలో మహిళలు స్వయం సహాయ సంఘాలుగా ఏర్పడి, ప్రతినెల నిర్ణీత సమయంలో సమావేశాలు ఏర్పాటు చేసుకొని వారి సమస్యలను చర్చించుకుంటూ అవసరాలను తీర్చుకుంటూ విజయపథంలో ముందడుగు వేస్తున్నారు.

అనంతరం 'ఇందిరా క్రాంతి పథం' పేరుతో పలు కార్యక్రమాలతో పేదప్రజల అన్నిరకాల అవసరాలు తీర్చడం మొదలు పెట్టింది. ఈ పథకంలో మహిళలు వారికి అవసరమైన సామర్థ్య పెంపుదల కార్యక్రమాలను పొందడమే కాక వారికి కావలసిన నిధులను కూడా సమకూర్చు కుంటున్నారు. అప్పులు ఇవ్వడానికి ఇష్టపడని వాణిజ్య బ్యాంకులు కూడా స్వయం సహాయ సంఘంలో వున్న ప్రతి సభ్యురాలికి రెండు లక్షల రూపాయల వరకు అప్పులు ఇస్తున్నారంటే మహిళాశక్తి ఎంతగా ఎదిగిందో అర్థమవుతుంది.

**ఆర్థిక అవసరాలు**

స్వయం సహాయ సంఘాల నుండి తమ కుటుంబ అవసరాలకు అనగా పిల్లల చదువులకు, ఆరోగ్యమునకు, జీవనోపాధుల పెంపుదల కొరకు, ఇంటి నిర్మాణము, మరమ్మతులు, వ్యవసాయ పెట్టుబడి మొదలగు అన్నిరకాల అవసరాలకు కావలసిన అప్పులను తాము తమ స్వయం సహాయ సంఘాల నుండి పొందుతున్నామని మహిళలు సగర్వంగా చెప్పుకుంటున్నారు.

**ఒకరికోసం అందరు**

స్వయంసహాయ సంఘాల లోని మహిళలు కేవలం వారి కుటుంబ అవసరాలే కాక తోటి మహిళలకు కూడా తోడ్పాటు అందిస్తున్నారు. నిరాదరణకు గురియైన వారు, ఒంటరి మహిళలు, భర్తలు చనిపోతే పిల్లలకు అన్నీ తానై చూసుకొనే మహిళలు ఇలా ఎన్నో రకాల సమస్యలతో సతమతమవుతూ వున్న మహిళలను స్వయం సహాయ సంఘాలు అక్కున చేర్చుకొని వారికి అన్నిరకాల తోడ్పాటు అందిస్తున్నాయి.

ఇంతేగాక వివిధ రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో కూడా స్వయం సహాయ సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

**ఏపిమాస్ ద్వారా సామర్థ్యం పెంపుదల కార్యక్రమాలు**

2005-10 మధ్య కాలంలో ఏపిమాస్-సెర్ప్ ఒప్పందంలో భాగంగా ఏపిమాస్ సంస్థ చిత్తూరు జిల్లా

బంగారుపాలెం మండలంలోని స్వయం సహాయ సంఘాల ప్రతినిధులకు , సిబ్బందికి వివిధ రకాల సామర్థ్య పెంపుదల కార్యక్రమాలను చేపట్టింది.

ఈ వ్యాస రచయిత తమ కార్యక్రమాలలో భాగంగా మార్చి నెల మొదటి వారంలో బంగారుపాలెంలోని మండల మహిళా సమాఖ్య సమావేశానికి హాజరు అయినప్పుడు రెండు దశాబ్దాల స్వయం సహాయ ఉద్యమ ప్రస్థానం గురించి చాలా ఆనందంగా తెలియజేశారు. మండల మహిళా సమాఖ్యతో చర్చలలో శ్రీదేవి స్వయం సహాయ సంఘాన్ని గురించి ప్రస్తావన వచ్చింది. ఆదర్శ సంఘంగా ఎదిగిన ఆ సంఘాన్ని గురించి మరింతగా అధ్యయనం చేయగా ఈ విషయాలు తెలియవచ్చాయి.

**శ్రీదేవి స్వయం సహాయ సంఘం**

శ్రీదేవి స్వయం సహాయ సంఘం 10 మంది మహిళలతో 28.03.2008వ తేదిన ఏర్పాటైంది. స్థానిక సప్తగిరి గ్రామీణ బ్యాంక్ లో పొదుపు ఖాతాను తెరచి ప్రతి సభ్యురాలు నెలకు 30 రూపాయల పొదుపుతో ప్రారంభించి ప్రస్తుతం నెలకు 500 రూపాయలు పొదుపు చేస్తున్నారు.

**సంఘ ఆర్థిక లావాదేవీలు**

2024 ఫిబ్రవరి నెల వరకు సంఘంలో ఒక్కో సభ్యురాలి పొదుపు 36,100 రూపాయలతో సంఘం పొదుపు 3,61,000 రూపాయలకు చేరుకున్నది. తమ పొదుపు మొత్తం నుంచి సభ్యులు అంతర్గత అప్పులు ఇచ్చు కుంటుండడంతో 4,58,241 రూపాయలు వడ్డీ వచ్చింది. ప్రస్తుతం సంఘ నిధి మొత్తం 8,19,241 రూపాయలు వున్నది. సభ్యుల మధ్య పొదుపు అప్పు నిల్వ 7,06,500 రూపాయలు వున్నది. బ్యాంక్ నిల్వ 1,12,741 రూపాయలు.

**బ్యాంక్ నుండి పొందిన రుణాలు :**

శ్రీదేవి స్వయం సహాయ సంఘం 2008లో ఏర్పడగా 2009లో మొదటిసారిగా బ్యాంక్ ఋణం పొందినది. ఇప్పటివరకు ఆరుసార్లు ఋణం తీసుకొని, సకాలంలో తిరిగి చెల్లించినందున ఏడవ లింకేజిలో బ్యాంక్ మేనేజరు ప్రతి సభ్యురాలికి 2.0 లక్షల రూపాయలు ఋణం యిస్తానని చెప్పడంతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రతి సభ్యురాలు స్వయం సహాయక సంఘం నుండి ఆరుసార్లు ఋణం పొందినది. తాము పొందిన ఋణం 3.31లక్షల రూపాయ లతో వివిధరకాలుగా లబ్ధి పొందారు. వారు పొందిన ప్రయోజనాలు క్రింది విధంగా వున్నాయి.

| సభ్యురాలి పేరు | ప్రధాన లబ్ధి |
|---|---|
| 1 జి.రాజేశ్వరి | ఇల్లు నిర్మించు కొన్నది |
| 2. బి. అమల | పిల్లల చదువులు |
| 3. జి.కనకమ్మ | పాడి ఆవుల కొనుగోలు |
| 4.. సి.పండరి | బట్టల దుకాణం |
| 5. కె. లక్ష్మి | కిరాణా అంగడి |
| 6. కె. శాంతి | కిరాణా అంగడి |
| 7. పి.రాధిక | పాడి ఆవుల కొనుగోలు |
| 8. ఎస్.నర్మద | పిల్లల చదువులు |
| 9. వై.నరసమ్మ | పూల వ్యాపారం |
| 10. ఆర్. హేమ | కొయ్యల పని |

**పలు రకాల రుణాలు**

స్వయం సహాయ సంఘ సభ్యులకు పలు రకాల రుణాలు అందుబాటులో ఉన్నందువలన వారి కుటుంబ అవసరాలకు సరిపడా ఋణం లభిస్తున్నదని సభ్యులు తెలిపారు. అవి పొదుపులు, బ్యాంకు రుణాలు, స్త్రీనిధి రుణాలు, సి.ఐ.ఎఫ్.రుణాలు, ఉన్నతి రుణాలు మొదలగునవి.

మహిళలు తమంతట తాముగా ఆలోచిస్తే తమ కుటుంబాలను తామే బాగుచేసుకుంటారనే నమ్మకంతో ప్రారంభించిన 'వెలుగు' పథకం అంచెలంచెలుగా విస్తరించి అన్ని వర్గాల ప్రజలకు , మారుమూల గ్రామాలకు సైతం చేరువైనదని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

బంగారుపాలెం మండలంలో జరిగిన సమావేశంలో కొంత మంది మహిళలు స్వయం సహాయ సంఘాలు లేనిదే తమకు జీవనమే లేదని కన్నీరు పెట్టుకోవడం వెలుగు పథకం వారి జీవితాలలో ఎంత వెలుగు నింపిందో అర్థం అవుతుంది. ■

భయంతో ఎక్కడికని పారిపోతావ్ ? ఆ భయం వున్నదే నీ గుండెలో !

# సంఘాల పునరుజ్జీవానికి 'మహిళా శక్తి' !

మహిళా స్వయంసహాయ సంఘాలకు ఆర్థిక చేయూతనిచ్చి, అవి పునరుత్తేజంతో, పూర్వవైభవం పొందాలన్న లక్ష్యంతో తెలంగాణా ప్రభుత్వం 'మహిళాశక్తి' పేరిట కొత్త పథకాన్ని ప్రారంభించింది. ఇన్నాళ్లూ సంఘాలకు బ్యాంకు లింకేజీ సౌకర్యం వున్నా, ప్రభుత్వ మార్గనిర్దేశం కొరవడి ఋణ సౌలభ్యాన్ని, ఆర్థిక వ్యవహారాలను సంఘాలు సమర్థంగా నిర్వహించుకోలేక పోయాయని, బ్రాండింగ్, ప్యాకేజింగ్ వంటి అంశాలలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోలేక, ఉత్పత్తుల్లో నాణ్యత కొరవడి, మార్కెటింగ్‌లో వ్యూహాత్మక సహకారం లేక మహిళా సంఘాలు బహిరంగ మార్కెట్‌లో పోటీకి నిలబడలేక పోయాయని, ఈ కారణంగా తమ వ్యాపారాభివృద్ధిలో సవాళ్ళను ఎదుర్కుంటున్న మహిళా సంఘాలను, సంఘ మహిళలను సంపన్నులుగా చేయాలనే ఆశయంతో ఈ కొత్త పథకాన్ని తీసుకు వస్తున్నట్టు తెలంగాణా ప్రభుత్వం పేర్కొన్నది.

సంఘాలలోని మహిళల శక్తి సామర్థ్యాలను వెలికి తీసి, వారు వారి వ్యాపార లక్ష్యాలను చేరుకునేలా సహకరించి, మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా నడిపించే పథకమే ఈ "మహిళా శక్తి". వచ్చే ఐదేళ్లలో సంఘాలలో ఉన్న 63 లక్షల మంది ఆడబిడ్డలను ఆర్థికంగా శక్తిమంతులుగా చేసి వారిని కోటీశ్వర్లుగా చేయడమే ఈ పథకం లక్ష్యమని ప్రభుత్వం పేర్కొన్నది. '

**మహిళా శక్తి' పథకం ఉద్దేశాలు**

'మహిళా శక్తి' పథకం ప్రధానంగా రెండు లక్ష్యాలతో పని చేస్తుంది. స్వయం సహాయ సంఘాల ద్వారా పలురకాల సూక్ష్మ పరిశ్రమలను, వ్యాపారాలను ప్రోత్సహించి సంఘాలలో సభ్యులుగా ఉన్న 63 లక్షల మంది మహిళల ఆర్థిక స్వావలంబనకు సహకరించడం. మహిళల సామాజిక భద్రత కోణంలో సంఘాలను బలోపేతం చేయడం.

సూక్ష్మ పరిశ్రమలను గుర్తించి, అందులో సంఘాలను ప్రోత్సహించడం. ఆయా సంఘాలలో మహిళలు తమ నైపుణ్యాలకు తగ్గ ఉత్పత్తులను ఎంచుకునేలా చూసి, ఆ ఉత్పత్తులకు అవసరమైన నైపుణ్యాన్ని అందించడం, అవసరమైన ఆర్థిక సహకారం కోసం బ్యాంక్ లింకేజీ సదుపాయం కల్పించడం, ఉత్పత్తి అయిన సరుకుల మార్కెటింగ్‌కు అవసరమైన ప్రణాళికలు, సహకారం అందివ్వడం ఈ మహిళాశక్తి పథకంలోని ప్రధాన అంశాలు

**1. లక్ష కోట్ల ఆర్థిక సహకారం:**

- స్వయం సహాయ సంఘాలకు వచ్చే ఐదేళ్లలో బ్యాంకులు, స్త్రీ నిధి ద్వారా రూ.లక్ష కోట్ల రుణాన్ని ఏర్పాటుచేయడం
- ఈ లక్ష కోట్లలో సూక్ష్మ పరిశ్రమలను, వ్యాపారాలను చేపట్టేందుకు ప్రత్యేకంగా రూ.25 వేల కోట్లు వినియోగించేలా ప్రోత్సాహం
- ప్రతి ఏటా అయిదు వేల గ్రామ సంఘాలు/ ప్రాంతీయ స్థాయి సమాఖ్యలకు రూ. కోటి చొప్పున రూ. 5 వేల కోట్లు సమకూర్చడం. రాష్ట్రంలోని 25 వేల గ్రామ సంఘాలకు, ఏరియా లెవెల్ ఫెడరేషన్లకు లబ్ధి
- మహిళా స్వయం సహాయ సంఘాలు బ్యాంకులనుండి సున్నా వడ్డీ ఋణాలు పొందేందుకు 'వడ్డీ లేని ఋణాలు' పథకం పునరుద్ధరణ

**3. ప్రభుత్వం తోడ్పాటు**

- మహిళలకు ఆసక్తి ఉన్న రంగాన్ని గుర్తించి, వారికి ఆ రంగంలో నైపుణ్య శిక్షణ ఇప్పించడం.
- అన్ని స్వయం సహాయ సంఘాల ఉత్పత్తులకు ఒకేరకమైన బ్రాండింగ్ కల్పించడం.

  ఉదాహరణకు: గోల్కొండ హస్తకళల తరహాలో... సంఘాల ఉత్పత్తులకు ఎఫ్ ఎస్ ఎస్ ఎ ఐ, అగ్‌మార్క్, సిల్క్ మార్క్ వంటి సంస్థలతో నాణ్యతా ప్రమాణాల ధృవీకరణ పత్రాలు అందించడం.
- స్వయం సహాయక సంఘాలు ఉత్పత్తి చేసే వస్తువులను అమెజాన్, ఫ్లిప్ కార్ట్, ఓఎన్డీసీ, బిగ్ బాస్కెట్ వంటి ఈ–

కామర్స్ వేదికలలో ఉంచే సదుపాయం కల్పించడం. వివిధ రకాల ట్రేడ్ ఫెయిర్లలో పాల్గొనే అవకాశంల్పించడం, పెద్ద పరిమాణంలో కొనుగోలు చేసేలా ఒప్పందాలకు సహకరించడం.

- ♦ వివిధ సంఘాలు ఉత్పత్తిచేసే ఒకే రకమైన వస్తువులను జిల్లా కేంద్రంలో ఒక చోటికి చేర్చి అక్కడే వాటికి ప్రాసెసింగ్ సదుపాయం కల్పించడం.
- ♦ ప్రతి జిల్లా కేంద్రంలో ఒక సెంటర్ ఏర్పాటు చేసి మహిళలకు నైపుణ్య శిక్షణ ఇప్పించడం, ఆయా సంఘాల ఉత్పత్తులకు అవసరమైన మార్కెట్ లింకేజీ ఏర్పాటు చేయడం.
- ♦ స్వయం సహాయక సంఘాలను ఐఐటిలు, ఐఐఎంలు, ఐఎన్‌బి, ఐఆర్ఎంఎ వంటి సంస్థలతో అనుసంధానించడం.
- ♦ సంఘాల సూక్ష్మ వ్యాపార ప్రణాళికను అధ్యయనం చేసి పెట్టుబడికి అవసరమైన ఋణ మంజూరు కోసం బ్యాంకులకు సిఫార్సు చేసేందుకు సెర్ప్, మెప్మా ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయడం.
- ♦ మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల కోసం ప్రతి శాసనసభ నియోజకవర్గం పరిధిలో ప్రత్యేక మినీ పారిశ్రామిక పార్క్ ఏర్పాటుకు ప్రతిపాదనలు.
- ♦ మహిళా పారిశ్రామికవేత్తలకు ఋణాలు, జీవిత బీమా తదితరాలతో సామాజిక భద్రత కల్పించడం. ఋణాల సెటిల్మెంట్లు, క్లెయిమ్‌లకోసం ప్రత్యేకమైన విభాగం ఏర్పాటు చేయడం

**4. ఋణ బీమా – జీవిత బీమా**

- ♦ స్వయం సహాయక సంఘాల మహిళలు తీసుకునే ఋణాలకు ప్రభుత్వం 'ఋణ బీమా పథకాన్ని' ప్రారంభిస్తుంది. బ్యాంకుల నుండి ఋణాలు తీసుకునే మహిళలకు దురదృష్టకర సందర్భంలో వారి కుటుంబాలపై భారం లేకుండా ఈ పథకం ఉపయోగపడుతుంది.
- ♦ స్వయం సహాయక సంఘాల్లోని 18–60సంవత్సరాల మధ్య వయస్సు గల 63.86 లక్షల మంది గ్రామీణ, పట్టణ ప్రాంత మహిళలకు ఒకొక్కరికి రూ.10 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించడం.

**5. అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం**

- ♦ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో మహిళా సంఘాల ద్వారా పారిశుధ్యం, మరమ్మత్తుల నిర్వహణ
- ♦ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలలో 'మధ్యాహ్న భోజన పథకం' మహిళా సంఘాల ద్వారా నిర్వహణ
- ♦ పాఠశాల నిర్వహణ కమిటి మహిళా సంఘాల ప్రతినిధుల నేతృత్వంలో పనిచేస్తుంది.

మైక్రో ఎంటర్‌ప్రైజ్ అభివృద్ధిలో మూడు ముఖ్యమైన ఉపకార్యక్రమాలు ఉంటాయి.

అవి : ♦ తయారీ ♦ ట్రేడింగ్ ♦ సేవలు

**తయారీ :**

పాడి పరిశ్రమ, పాడి పశువుల పెంపకం, మినీ డెయిరీ యూనిట్లు, బల్క్ మిల్క్ కూలర్లు, కోళ్ళ పెంపకం, మత్స్య పరిశ్రమ, మినీ పార్టీ యూనిట్లు, చేనేత వస్త్రాలు – రెడీమేడ్ వస్త్రాలు, ఆహార తయారీ, హస్తకళలు, ఇతర సూక్ష్మ సంస్థలు, యూనిఫాంలు కుట్టడం, సానిటరీ నేప్కిన్లు.

**ట్రేడింగ్ :**

మినీ సోలార్ యూనిట్లు (సాధ్యమయ్యే ప్రదేశాలలో), మార్ట్స్ (మిని సూపర్ మార్కెట్లు), జెనరిక్ మెడికల్స్, ఎఫ్‌పిఓలు (రైతు ఉత్పత్తిదారుల సంస్థలు), విత్తనాలు, ఎరువులు.

**సేవలు :**

క్యాటరింగ్, అందం – ఆరోగ్యం, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయ ఉపకరణాల అద్దె కేంద్రాలు, వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, మార్కెటింగ్, పంట కోతల తర్వాత అందించవలసిన సేవలు, ఈవెంట్ మేనేజ్మెంట్, రవాణ – లాజిస్టిక్స్, ఆతిథ్య సేవలు, ఐ.టీ సేవలు, మానవ వనరుల సరఫరా. ■

# జన్మభూమి సేవలో నిత్యానందరెడ్డి !

(9 వ పేజీ తరువాయి...)

**8. ఉచిత రక్షిత మంచి నీటి సరఫరా:** పీలేరు మండలంలోని 22 ప్రభుత్వ పాఠశాలలు, 2 జూనియర్ కళాశాలలు, 8 అంగన్వాడీ కేంద్రాలకు, ఒక ఆశ్రమానికి ప్రతిరోజూ ఉచితంగా వారికి సరిపడినంత సురక్షిత తాగునీటిని ఉచితంగా సరఫరా చేస్తూ అరబిందో ఫార్మా ఫౌండేషన్ చేయూతనిస్తోంది.

**9. ఎఫ్‌పిఓ మార్కెటింగ్:** రైతులు పండించిన మామిడి, టమాటా, బంగాళా దుంప పంటలను పీలేరు ఎఫ్ పీ ఓ ద్వారా గిట్టుబాటు ధరకు వివిధ కంపెనీలకు సరఫరా చేసి రైతులకు మంచి ధర అందించడం జరిగింది.



**10. సీహెచ్‌సీ :** పీలేరు ఎఫ్‌పీఓ ద్వారా రైతులకు కావాల్సిన యంత్ర పరికరాలను బయటి కంటే తక్కువ అద్దెతో రైతులకు ఇవ్వడం జరుగుతుంది. అరబిందో ఫార్మా ఫౌండేషన్ ద్వారా 30 లక్షల విలువ గల ట్రాక్టర్లు, మడకలు, రోటావేటర్లు, స్ప్రేయర్లు, ట్రాలీలు, మామిడి తోటలకు సరిపడ బూమ్ స్ప్రేయర్ను పీలేరు ఎఫ్ పి ఓకు సమకూర్చారు.

**11. ఇంటర్న్‌షిప్ :** వివిధ డిగ్రీ, పీజీ విద్యార్థినీ విద్యార్థులకు ఇంటెర్న్షిప్ ప్రోగ్రాం కింద ఎఫ్ పి ఓ ద్వారా జరుగుతున్న కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించడం జరుగుతున్నది.

ఇప్పటివరకు ఏపిమాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎఫ్ పి ఓ లలో 15మందికి అకౌంటెంట్లుగా, సి ఇ ఓలుగా ఉద్యోగావకాశం కల్పించారు.

**12. ఇన్పుట్ మార్కెటింగ్:** అరబిందో ఫార్మా ద్వారా రైతు సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు తక్కువ ధరకే ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, ఆవులకు కావలసిన పశువుల దాణా, పశువుల మందులు అందిస్తున్నారు. ఎఫ్ పి ఓలోని 750 నుంది రైతులకే కాకుండా చుట్టుపక్కల మండలాల్లోని రైతులకు కూడా అందిస్తున్నారు.

**13. ప్రకృతి వ్యవసాయం :** 2019 నుంచి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్స హించే క్రమంలో దాదాపు 50 మంది రైతులకు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తు లను ఉచితంగా అందించడమే. కాకుండా విత్తు నుంచి కోత వరకు వారికి అవసరమయ్యే సూచనలు సలహాలను అందించే ఏర్పాటు చేయడంతో పాటు పంటకు మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తున్నారు.

**14. ప్రభుత్వ పాఠశాలలకు, విద్యార్థులకు చేయూత:** పీలేరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు దాదాపు 18రకాల పుస్తకాలు అందించడమే కాకుండా ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతులు అనగా గూడరేపల్లి ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణం, రెండు తరగతి గదులు ప్రభుత్వ బాలికల పాఠశాలలకు ఆటస్థల నిర్మాణంతో పాటు ఆట వస్తువులు ఇవ్వడం జరిగింది. మరికొన్ని పాఠశాలలకు మరుగుదొడ్ల నిర్మాణం కంప్యూటర్స్ 625 బెంచీలు సమకూర్చారు. ■

# రిలయన్స్ ఎఫ్ పి ఓల సిబ్బందికి ఏపిమాస్ శిక్షణ

– జి.శ్రీనివాస్



రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పని చేస్తున్న ఎఫ్ పి ఓల (రైతు ఉత్పత్తిదారుల సంస్థల) సి ఇ ఓ లకు 18-03-2024 నుండి 20-03-2024 వరకు మూడు రోజుల పాటు ఎఫ్ పి ఓల వ్యాపార నిర్వహణపై శిక్షణను, కార్యశాలను హైదరాబాద్‌లోని ఏపిమాస్ శిక్షణ కేంద్రంలో నిర్వహించింది. ఈ శిక్షణ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ లోని కర్నూలు, ప్రకాశం, గుంటూరు జిల్లాల నుండి , తెలంగాణా లోని నిర్మల్, కామారెడ్డి జిల్లాల నుండి 23 మంది అభ్యాసకులు పాల్గొన్నారు.

మూడు రోజుల పాటు జరిగిన శిక్షణలో వివిధ జిల్లాల నుండి వచ్చిన అభ్యాసకులు ముందుగా వారి ఎఫ్‌పిఓలలో జరుగుతున్న కార్యక్రమాల గురించి వారి అనుభవాలను పంచుకున్నారు. శిక్షణ ప్రారంభంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థల ఏర్పాటు ఉద్దేశం, కార్యక్రమాలు మొదలగు అంశాలను ఏపిమాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి యస్.రామలక్ష్మి, శ్రీ మురళి జాజున వివరించారు. తదుపరి రిసోర్స్ పర్సన్ శ్రీ సతీష్ మార్కెటింగ్ మోడల్ మార్కెటింగ్ సైకిల్, మార్కెట్ అసెస్మెంట్ గురించి వివిరించారు.

శిక్షణలో రెండవ రోజు మార్కెటింగ్ ప్రణాళిక, మార్కెటింగ్ ఏర్పాట్లు, సిస్టం, కొనుగోలు సమయంలో నాణ్యత ఎలా ఉండాలి అనే అంశాలను శ్రీ సతీష్ వివరించారు.

శ్రీమతి రామలక్ష్మి ఆర్థిక పట్టికలను అర్థం చేసుకోవటం, దామాషా (రేషియో) మొదలగు అంశాలను వివరించారు.

శ్రీ మురళి జాజున నిర్వహణ వ్యయాన్ని గురించి వివరించారు. శ్రీ కిషోర్ కుమార్, శ్రీ శ్రీనివాస్ రెడ్డి చట్టపరమైన అంశాలు, జి.యస్.టి మొదలగు విషయాలను వివరించారు. శ్రీ జి. శ్రీనివాస్ రైతు ఉత్పత్తిదారుల సంస్థలలో వివిధ కార్యక్రమ అంశాలు సభ్యులకు, సిబ్బందికి సరళంగా అర్థం అయ్యేలాగా ఏ విధంగా వివరించాలో సాఫ్ట్ స్కిల్ పైన వివరించారు.

రిలయన్స్ ఫౌండేషన్ నుండి శ్రీ శివానంద, శ్రీ రామచంద్ర పాల్గొని అభ్యాసకులు నేర్చుకున్న అంశాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు.

రాబోయే మూడు నెలలలో అభ్యాసకులు ఇక్కడ నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో ఎలా అమలు జరుపుతారో ఒక చక్కని ప్రణాళిక తయారు చేయటం జరిగింది.

చివరగా అభ్యాసకులకు ఏపిమాస్ టీం శ్రీమతి యస్ రామలక్ష్మి, శ్రీ వసంత్, శ్రీ మురళి జజునా, శ్రీ జి. శ్రీనివాస్ సర్టిఫికేట్లు అందజేశారు. ఈ విధంగా మూడు రోజుల పాటు జరిగిన శిక్షణ గురించి అభ్యాసకులు మాట్లాడుతూ శిక్షణ చాలా బాగా జరిగిందని , శిక్షణ ఇచ్చిన రిసోర్స్ పర్సన్‌లకు, శిక్షణ ఏర్పాటు చేసిన ఏపిమాస్ వారికి, రిలయన్స్ ఫౌండేషన్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ■

# పసుపు ఆకులతో పసిడి తైలం !

*ఇది వ్యవసాయ రంగంలో సరికొత్త విప్లవం! రూపాయి పెట్టుబడిలేకుండా, సొంత పొలం లేకపోయినా లక్షలు ఆర్జించే విలక్షణ విలువ ఆధారిత ఉత్పత్తులకు నమూనా. దేశంలోనే తొలిసారి తెలంగాణ మహిళలు సాధించిన విజయం!*

**మా**మూలుగా వేరుశనగలు, కునుమ, పొద్దుతిరుగుడు పూలతో నూనె తీస్తారని అందరికీ తెలుసు. అయితే వృథాగా పారేసే పసుపు ఆకులతో తైలం తీయవచ్చు అని నిరూపించారు గ్రామీణ మహిళలు.

నిత్యావసర వస్తువుల్లో పసుపు ముఖ్యమైన దినుసు కానీ ఈ పంట సాగు అనంతరం కాలుష్యం సమస్య ఎక్కువగా ఉంది. ఆకులు కోసిన తర్వాత రైతులు వాటిని కుప్పలుగా పోసి తమ పొలాల్లోనే తగలబెడతారు. దీనివల్ల తీవ్రమైన వాయు కాలుష్యం ఏర్పడుతుంది. మరోవైపు పసుపు ప్రారంభం నుండి ప్రాసెసింగ్ వరకు ఎకరాకు లక్షన్నర రూపాయల వరకు పెట్టుబడి అవుతుంది కానీ తగిన ఆదాయం రాక రైతులు చాలాసార్లు నష్టపోతున్నారు.






**విదేశాల్లో డిమాండ్...**

తెలంగాణలో పసుపు ఎక్కువగా పండించే నిజామాబాద్ జిల్లాలో కూడా ఇదే పరిస్థితి. ఇదంతా గమనించిన ఏర్గట్ల మండలం, గుమ్మిర్యాల్ గ్రామ ఎస్ హెచ్ జి మహిళలు ఒకరోజు సమావేశం అయ్యారు.

పసుపు రైతుల ఆదాయం పెంచడం కోసం, పసుపు ఆకులను వృథాగా పారేయకుండా, కాల్చకుండా వాటి నుండి అదనపు ఆదాయం పొందాలనుకున్నారు. "పసుపు పంట కోసం లక్షలు ఖర్చుపెట్టి వేలల్లో మాత్రమే ఆదాయం పొందుతున్నాం. నష్టం వస్తుందని తెలిసినా పొరుగు రైతు వేశాడు కదా, మనం కూడా వేయకపోతే ఊర్లోవారు ఏమనుకుంటారో' అని అందరూ పండించి నష్టపోతున్నారు. ఒకరకంగా మాకు పసుపు పంట పరువు పంట" అంటారు గుమ్మిర్యాల్ రైతులు.

వీరి పరిస్థితిని స్టడీ చేసిన ఐసిఐసిఐ ఫౌండేషన్ పసుపు సాగులో అంతర పంటలుగా జొన్న, కంది సాగును ప్రోత్స హించి అదనపు ఆదాయం వచ్చేలా ప్రయత్నం చేసినప్పటికీ నష్టాలు తగ్గలేదు. అనంతరం వీరు వృథాగా కాల్చేస్తున్న పసుపు ఆకుల పై దృష్టి సారించారు. విదేశాల్లో పసుపు ఆకులకు డిమాండ్ ఉందని తెలుసుకున్నారు.

హైదరాబాద్ లోని బోడుప్పల్లో సుగంధ పంటల పరిశోధన కేంద్రం సీమ్యాప్ (సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడిసినల్ అండ్ అరోమాటిక్ ప్లాంట్స్, రీసర్చ్ సెంటర్) సైంటిస్టులను కలిశారు. వారు పసుపు ఆకులపై పరిశోధన చేసి వాటిలో నూనె ఉందని తైలాన్ని తీసి చూపించారు. దీనివల్ల అదనపు ఆదాయమే కాక కాలుష్యాన్ని తగ్గించి, పర్యావరణాన్ని కాపాడుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు.

పరుషమైన మాటలే కాదు, పెదవి విప్పని మౌనం కూడా మనసును ముక్కలు చేయవచ్చు

## తైలంలో ఏముంది?

"గుమ్మిర్యాల్ రైతులు తెచ్చిన ఆకుల్లో, ఆల్ఫా–ఫిల్లన్‌డ్రెన్, టెర్పినోలీన్, లైమోనినె రసాయనాలు ఉన్నాయి. ఈ తైలానికి మార్కెట్లో చాలా డిమాండ్ ఉంది. ఫార్మా ఫుడ్ ఇండస్ట్రీలలో దీనిని వాడుతారు. టన్ను ఆకులను ప్రాసెస్ చేస్తే. 10 కిలోల నూనె ఉత్పత్తి అవుతుంది. తైలం తీయడంలో శుద్ధి చేయడంలో మహిళలకు శిక్షణ ఇచ్చి, సాంకేతిక సహకారం కూడా అందించాం. వారి ఉత్పత్తికి మార్కెట్ సౌకర్యం కూడా కల్పిస్తున్నాం. దేశంలోనే మొదటిసారి తెలంగాణలో పసుపు ఆకుల నుండి తైలం తీసే ప్రక్రియ మొదలైంది."

***– కిరణ్‌బాబు, సీమ్యాప్ సీనియర్ సైంటిస్ట్***

**ఆకులకే ఎక్కువ ఆదాయం...**

నిజామాబాద్ జిల్లా, ఏర్గట్ల మండలంలోని గుమ్మిర్యాల్లో రూ. 15 లక్షల వ్యయంతో ఆయిల్ తీసే యంత్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో రూ. 125 లక్షలను 'మణికంఠ స్వయం సహాయక సంఘం' సభ్యులకు ఐసిఐసిఐ ఫౌండేషన్ గ్రాంట్‌గా ఇచ్చింది. మిగతాది ఎన్‌హెచ్‌జి మహిళలు సమకూర్చుకున్నారు.

'దాదాపు 400 మంది రైతుల నుండి పసుపు ఆకులను సేకరిస్తున్నాం. ఈ మధ్యనే ఆయిల్ తీయడం మొదలు పెట్టాం. విదేశాల్లో ఆయిల్ ధర కిలో రూ. 12 వేల వరకు ఉందని ఐసిఐసిఐ ఫౌండేషన్ ప్రతినిధులు చెప్పారు. వారి సహకారంతో పసుపు ఆకులతో నూనె తీసే పనిలో బిజీగా ఉన్న మణికంఠ ఎస్‌హెచ్‌జి సభ్యులు సాయమ్మ, రాజవ్వ "ఇది పసుపు కంటే ఎక్కువ రాబడి' అన్నారు.

ఈ విధంగా తమ ఊరును కాలుష్యం నుండి కాపాడటమే కాక, పనికిరాని పసుపు ఆకులను వైవిధ్యమైన విలువ ఆధారిత ఉత్పత్తిగా మార్చి, రైతులకు ఆదాయం పెంచడమే కాక, తాము స్వయంసమృద్ధి సాధిస్తూ, దేశానికి ఆదర్శంగా మారారు గుమ్మిర్యాల్ మహిళలు. ■

## వ్యాపార సంస్థలుగా ఎదిగితేనే ఎఫ్ పి ఓలకు మనుగడ; సి ఎస్

ఎఫ్ పి ఓలు వ్యాపార సంస్థలుగా పనిచేయ వలసిందేనని, రైతులు వ్యవసాయాన్ని ఒక వ్యాపారంగా చూడడం అలవరచుకోవాలని ఏపిమాస్ సి ఇ ఓ, ఎం డి శ్రీ సి ఎస్ రెడ్డి పేర్కొన్నారు. 2024 మార్చి 5 వ తేదీన తేదీన కలకత్తాలో నాబార్డ్, బర్డ్ సంయుక్తంగా నిర్వహించిన తూర్పు, ఈశాన్య రాష్ట్రాల ఎఫ్ పి ఓల మహాసభలో ఆయన ప్రసంగించారు. మహిళా రైతులతో ఎఫ్ పి ఓల ఏర్పాటు అవసరమని, దశాబ్దాల అనుభవం కలిగిన స్వయంసహాయ రంగం అభివృద్ధిచేసిన సామాజిక వనరులనుంచి ఎఫ్ పి ఓలు లబ్ధిపొందాలని ఆయన సూచించారు. ఎఫ్ పి ఓలు తమ వ్యాపార ప్రణాళికలను ప్రభుత్వాలు, లేదా బ్యాంకులను సంతృప్తి పరచడంకోసం కాక తమ అవసరాలకు అనుగుణంగా రూపొందించుకోవాలని శ్రీ రెడ్డి విస్పష్టంగా పేర్కొన్నారు. ఈ విషయంలో ఎఫ్ పి ఓలకు అనుగుణమైన వ్యాపార ప్రణాళిక రూపకల్పనకు ఏపిమాస్ శ్రీకారం చుట్టిందని ఆయన తెలిపారు. ఎస్ హెచ్ జి సమాఖ్యల మాదిరిగానే ఎఫ్ పి ఓల సమాఖ్యలను ఏర్పాటుచేయాలని, అప్పుడే అవి స్వయం నియంత్రణను సక్రమంగా సాగించగలుగుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఎఫ్ పి ఓలు విజయవంతమైన వ్యాపార సంస్థలుగా ఎదగాలంటే, సభ్యులలో ఈ సంస్థ మాదే , మేమే దీనికి యజమానులం అన్న దృఢాభిప్రాయం, సమర్థమైన నాయకత్వం ఎంతో ముఖ్యమని శ్రీ రెడ్డి పేర్కొన్నారు. ఎఫ్ పి ఓల ఏర్పాటులో నాబార్డ్ కనీసం పదేళ్ళ ప్రణాళికతో వ్యూహంతో రూపొందించాలని, నాబార్డ్‌తో కలసి బర్డ్ ఎఫ్ పి ఓ లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన కోరారు. సభ్య రైతులకు తగిన సేవలు అందించాలన్నా, రైతుల ఆదాయం పెరగాలన్నా ఎఫ్ పి ఓల కంప్యూటీకరణకు అధిక ప్రాధాన్యం యివ్వాలని శ్రీ సి ఎస్ రెడ్డి సూచించారు. 2024 మార్చి 4 వ తేదీన లక్నోలో బర్డ్ అకడమిక్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో శ్రీ సి ఎస్ రెడ్డి పాల్గొన్నారు. ■

# లాభదాయక వ్యవసాయానికి భూసార పరీక్షలు!




రైతులు భూసార పరీక్షలను చేయించుకొని అందుకు అనుగుణంగా వ్యవసాయ మెలుకువలు పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చని నాబార్డు జిల్లా అధికారి వినయ్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా యాదగిరిగుట్ట మండలం చోల్లేరు గ్రామంలో నాబార్డు ఆధ్వర్యంలో, పీస్ సంస్థ సహకారంతో అజీవా ఎఫ్ పి ఓలు (రైతు ఉత్పత్తిదారుల సంఘాలు), మహిళా సంఘ సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త ప్రొఫెసర్ మధుబాబు, వారి బృందం నాబార్డు తెలంగాణ సౌజన్యంతో పీస్ సంస్థ సహకారంతో 10 ఎఫ్ పి ఓల్లోని 500 మంది రైతులకు శిక్షణ యిచ్చారు. మేలైన యాజమాన్య పద్ధతులు, భూసార పరీక్షల ఆవశ్యకత, భూసార సంరక్షణ, రైతు ఉత్పత్తిదారుల సంఘాలను మార్కెట్లో అనుసంధానం వంటి అనేక అంశాలపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా రైతు మహిళలకు భూసార పరీక్షలు చేసే విధానాన్ని యంత్రం ద్వారా వివరించారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ మధుబాబు, సంఘాల బలోపేతం, వ్యవసాయ మెలుకువలు, పెట్టుబడి తగ్గించి అధిక లాభాలు గడించడానికి అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులు వివరించారు. కేవలం 40 నిమిషాల సమయం లోనే ప్రధాన పోషకాలతో పాటు 11 సూక్ష్మ ధాతుల లభ్యతను పరీక్షించేభూసార యంత్రాన్ని నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి వినయ్ కుమార్ ఆవిష్కరించి ఆజీవా ఎఫ్ పి ఓ కు అందజేశారు.

ఈ సందర్భంగా వినయ్ కుమార్ మాట్లాడుతూ సంఘాల అభివృద్ధికి నాబార్డ్ అనేక కార్యక్ర మాలు అమలు చేస్తుందని తెలియజేశారు. ఇందులో పాల ఉత్పత్తుల తయారీకి కావలసిన కార్యక్రమాలు రూపొందించా మన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతు ముంగిటకు వచ్చి అమలు చేసే ఈ కార్యక్రమాలను వినియోగించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఐఐఆర్ సీనియర్ శాస్త్రవేత్త డా. మంగళీప్ టూటీ వివిధ వరి రకాలు, వాటి విశిష్టతలు, పంటల అధిక దిగుబడికి మెళుకువలు మొదలైన అంశాలను వివరించారు. కూరగాయల సాగులో మెళుకువలు, రకాలు, యాజమాన్య పద్ధతులపై డా. చైతన్య వివరించారు. పలువురు రైతు మహిళా సభ్యుల సందేహాలను శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీస్ సంస్థ ఎగ్జిక్యూ టివ్ డైరెక్టర్ నిమ్మయ్య, అజీవ డైరెక్టర్లు అరుణ, స్వరూప, మౌనిక, అనురాధ , 60 మంది మహిళా రైతులు పాల్గొన్నారు.

■

పుట్టిన రోజు గొప్పదే, కాని ఎందుకు పుట్టామో తెలుసుకోగలిగితే ఆరోజు అంతకంటె గొప్పది

# మహిళా ఉద్యోగులకు అదనపు సెలవులు

**నేటి** సమాజంలో భార్యాభర్తలు ఇద్దరూ సంపాదిస్తేనే ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంసార జీవితం సాఫీగా సాగుతుంది. అయితే.. మగవారితో పోలిస్తే ఉద్యోగాలు చేసే ఆడవారు కాస్త ఎక్కువగా శ్రమిస్తుంటారు. ఆఫీస్ పనులతో పాటు ఇంటి పని, బాధ్యతలు అన్నీ వారికే. అప్పుడప్పుడు మగవాళ్లు సహాయం చేస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో కష్టపడేది మాత్రం ఆడవారే. ఇంటిపనులు చేస్తూ ఉద్యోగాలు చేసే వారి కోసం ఒడిశా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

రాష్ట్రంలోని వివిధ శాఖల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులకు వారు పొందుతున్న 15 రోజుల పాటు అదనంగా 10 రోజుల క్యాజువల్ లీవ్‌ను ఇవ్వాలని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆదేశాలు జారీ చేశారు. మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇంటి బాధ్యతలు, ఇతర సమస్యలను దృష్టిలో ఉంచుకుంది ఈ ప్రకటన చేసినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది.

గత వారమే రాష్ట్ర ప్రభుత్వం మహిళా బ్లాక్ గ్రాంట్ ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను ప్రకటించింది. గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లుల కోసం రాష్ట్ర-నిర్దిష్ట పథకం 'మమత' కింద ప్రసూతి ప్రయోజనాన్ని రూ. 5,000 నుంచి రూ. 10,000కు పెంచింది. మాతా శిశు మరణాలను తగ్గించేందుకు 2011లో ప్రారంభించిన ఈ పథకం ఇప్పటివరకు 60 లక్షల మంది గర్భిణులు, బాలింతలకు ప్రయోజనం కలిగించింది.

బ్లాక్ స్థాయి, పంచాయతీ స్థాయి ఎస్‌హెచ్‌జీ సమాఖ్య మహిళా అధికారుల ప్రతి సమావేశానికి రోజువారీ భత్యాన్ని 500రూపాయలకి పెంచింది. సభ్యులు, నాయకత్వ స్థానాల్లో ఉన్న 150,000 ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ఒక్కొక్కరికి 2,000 రూపాయల చొప్పున ఇవ్వాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది.

2019లో బిజూ స్వాస్థ్య కళ్యాణ్ యోజన, ఆరోగ్య బీమా పథకం ఉన్న కుటుంబాలలోని పురుషులకు ప్రైవేట్ ఆసుపత్రులలో 5 లక్షల రూపాయల వరకు చికిత్స అందిస్తుండగా మహిళలకు 10 లక్షల రూపాయల వరకు అందించనున్నారు.

వచ్చే నెలలో జరగనున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రకటనలు చేస్తుండటం గమనార్హం. ఈ పథకాల ద్వారా అధికంగా లబ్ధి పొందేది మహిళలే. ఒడిశా జనాభాలో పురుషుల కంటే మహిళల సంఖ్యే అధికం. 2000లో మహిళల ఓటింగ్ 54% వుంటే 2019లో అది 74%కి పెరిగింది. అంతే కాకుండా ప్రభుత్వ ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్లు ప్రకటించిన తొలి రాష్ట్రం ఒడిశా కావడం విశేషం. ■

## ఆధార్ ఉచిత అప్‌డేట్‌కు మరోసారి గడువు పొడిగింపు

**మీ**రు ఆధార్ కార్డ్‌ను ఇంకా అప్డేట్ చేసుకోలేదా. అయితే మీకో గుడ్ న్యూస్ ! కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ఆధార్ అప్‌డేట్ చేసుకునే చివరి తేదీని మళ్లీ పొడిగించింది. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యుఐడిఎ) ఇప్పుడు ఆధార్ కార్డ్ అప్‌డేట్ కోసం జూన్ 14వరకు తమ సమాచారాన్ని ఉచితంగా అప్‌డేట్ చేసుకోవచ్చని ప్రకటించింది. దీనికి ముందు మార్చి 14 దీనికి గడువు ఉండగా ఇప్పుడు దానిని పొడిగించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

ప్రస్తుతం అత్యంత ముఖ్యమైన డాక్యుమెంట్లలో ఆధార్ కార్డ్ ఒకటిగా మారింది. కానీ ఇది అప్‌డేట్ చేసుకోకపోతే ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల స్కీమ్‌లలో ఇది ప్రామాణిక గుర్తింపు కార్డుగా మారింది. అప్‌డేట్ చేసుకోవాలని అనుకునేవారు వారి చిరునామా లేదా ఇతర సమాచారాన్ని ల్యాప్టాప్ లేదా స్మార్ట్ ఫోన్ బ్రౌజర్ ద్వారా కూడా ఉచితంగా అప్‌డేట్ చేసుకోవచ్చు. ■

# భావజాలం ముఖ్యం కాదు...స్పందించడం ప్రధానం

మన సమాజంలో మహిళల హక్కుల కోసం పోరాడుతున్న కార్యకర్తలు అనేకమంది. రకరకాల సిద్ధాంతాల ప్రాతిపదికన పనిచేస్తున్నా వారందరి లక్ష్యం మహిళల అభ్యున్నతే! అలాంటి వారిలో ఒకరు సాయని విజయభారతి. ఆమె ఇటీవలే జాతీయ మానవహక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సభ్యురాలిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తన పోరాటాలను, మహిళా న్యాయవాదిగా తన అనుభవాలను ఆంధ్రజ్యోతి 'నవ్య'తో పంచుకున్నారు.



ఆంధ్రజ్యోతి సౌజన్యంతో ఆ విశేషాలు ' మహిళా సాధికారత' పాఠకుల కోసం.

"40 ఏళ్లుగా సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నా. ఈ ప్రస్థానంలో నాకు ఎదురయిన అనుభవాలెన్నో! ఉదాహరణకు ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు, ఆసుపత్రుల్లో ఇబ్బందులు ఎదురయినప్పుడు– నిజ నిర్ధారణకు వెళ్లేవాళ్లం. మమ్మల్ని గేటు దాటి లోపలికి వెళ్లనిచ్చేవారు కాదు. బాధితులను కలవాలని ఎంత ప్రయత్నించినా కుదిరేది కాదు. అదే ఇప్పుడు... జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యురాలుగా అన్యాయానికి ఆస్కారమున్న ప్రతిచోటును సందర్శిస్తున్నాను.

కొద్ది రోజుల కిందట నింబోలి అడ్డాలోని జువెనైల్ హోమ్‌కు వెళ్ళడమే కాదు, లోపలి పరిస్థితిని కళ్లారా చూశాను. చట్టంతో విభేదించిన పిల్లలతో కొంత సమయం గడిపాను. అలాగే నల్గొండ జిల్లాలోని కస్తూర్బా బాలికల వసతి గృహాన్ని సందర్శించాను. అక్కడ అమ్మాయిల పరిస్థితి చూసి నాకు కన్నీళ్ళు ఆగలేదు. దాదాపు 200మందికి పైగా విద్యార్థినులకు కేవలం ఆరు మరుగుదొడ్లు. వాళ్ళ గదుల్లో పాములు, ఎలుకలు తిరుగాడుతున్నాయి.

మరొక ఎస్టీ హాస్టల్‌లో గదులన్నీ బూజుపట్టి భయానక స్థితిని తలపిస్తున్నాయి. మలమూత్ర వ్యర్థాలతో బ్లాక్ అయిన లెట్రిన్లు, పెచ్చులూడిన గోడలతో బాత్రూమ్‌లు... వీటన్నిటిని గమనించాక 'ప్రభుత్వ వసతిగృహాల్లో ఉండే వారిని సాటి మనుషులుగా చూస్తున్నామా?' అనిపించింది. అదే వసతి గృహంలో రోజుకు 800 మంది పిల్లల కోసం 180 కేజీల బియ్యం వండుతున్నట్టు లెక్కల్లో చూపిస్తున్నారు. పిల్లాడికి పిడికెడు బువ్వకు మించి వడ్డించడంలేదు. కోడిగుడ్లు రిజిస్టర్‌లో ఉంటాయి కానీ చిన్నారుల కంచాలలో కనిపించవు. 'ఇంత అన్యాయాన్ని చూడకుండా ఇన్నాళ్ళు కళ్ళు మూసుకొన్నానా?' అనిపించింది.

నా పరిశీలనలో గమనించిన విషయాలన్నిటితో నివేదిక తయారుచేసి, దాన్ని మా ఛైర్‌పర్సన్‌కు ఇచ్చాను. ఇలా సమాజానికి నా వంతుగా సేవ చేసే సదావకాశం ఈ పదవి ద్వారా లభించిందని సంతోషిస్తున్నాను. నాకు ఇదొక బాధ్యత అంతే! అంతకుమించి దీన్ని ఒక హోదాగానో, లేదంటే అధికారంగా మాత్రం నేను భావించడం లేదు.

**సందేశ్‌ఖాలీలో రాక్షసలీలలు**

జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యులం ఒక బృందంగా పశ్చిమబెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో ప్రతి ఇంటికి వెళ్లి తలుపు తట్టాం.

బాధితురాళ్ళను కలిసి విచారిస్తే, "మీరు ఇవాళ వచ్చి మాట్లాడి వెళతారు. తర్వాత గూండాలు పోలీసు వేషాల్లో

వచ్చి మమ్మల్ని చావబాదుతారు" అంటూ మాతో మాట్లాడటానికి నిరాకరించారు. సాటిమహిళగా వారికి ధైర్యం నూరిపోసి, 'ఏమీ కాదు' అని భరోసా ఇచ్చాం. ఒక్కొక్కరు బాధను బయటకు చెబుతుంటే... నా గుండె తరుక్కుపోయింది.

ప్రతి ఇంటా అత్యాచార బాధితురాళ్లున్నారు. సాగు భూమిని కోల్పోయినవారున్నారు. అక్కడి ప్రజలకు ఓటు అంటే తెలియదు. ఎన్నికల సమయంలో వారితో స్థానిక అధికార పార్టీ నాయకుడు ఒట్టు పెట్టించుకొని పంపుతారట. ఇలా ఒకటా, రెండా... బాధితుల నోట షేక్ షాజహాన్ అరాచకాలు వింటుంటే... కంసుడు, రావణాసురుడు చాలా మంచివాళ్లు అనిపించారు.

సందేశ్‌ఖాలీలోని రాక్షస లీలలు అన్నీ ఇన్నీకావు మరి. మేము డైరెక్షన్ ఇచ్చాక పోలీసులు బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకోవడం మొదలు పెట్టారు. అక్కడి వారందరికీ మా ఫోన్ నెంబరు ఇచ్చాం. అధికారులు స్పందించకుంటే మాకు తెలియజేయండని ధైర్యాన్ని ఇచ్చి వెనుతిరిగాం. సాధ్యమైనంత వరకు ఎన్‌హెచ్ఆర్‌సీ అధికారాల పరిధికి లోబడి... సంబంధిత అధికారులకు తగిన మార్గదర్శకాలు ఇచ్చాం.

**సామాజిక కార్యకర్తగా...**

మా సొంతూరు నెల్లూరు జిల్లా కోవూరు. ఆచార వ్యవహారాలకు ప్రాధాన్యత ఇచ్చే అతి సాధారణ కుటుంబం మాది. మా నాయనమ్మ ఆదెమ్మ ప్రకాశం జిల్లా దేవరంపాడులోని ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. జాతీయ నాయకులు ఆమెను అభినందించారు.

నాకు 17ఏట పెళ్లి అయింది. నా భర్త నరహరి మాధవరావు. ఆయన ఆర్ఎస్ఎస్ కార్యకర్త. ఆయన శాఖ నుంచి ఇంటికి కొన్ని పుస్తకాలు వెంట తెచ్చేవారు. వాటిని నేను కూడా బాగా చదివేదాన్ని. ముఖ్యంగా భారతదేశ చరిత్ర, సంస్కృతి సంబంధిత విషయాలు నన్ను అమితంగా ప్రభావితం చేశాయి. నేను కూడా సంఘ్ కార్యక్రమాల్లో పాల్గొనేదాన్ని. నా భర్త ప్రభుత్వ బ్యాంకు ఉద్యోగి కావడంతో బదిలీల వల్ల కొంతకాలం అనకాపల్లి, ఎలమంచిలి ప్రాంతాల్లో ఉన్నాం. అదే సమయంలో పార్వతీపురం చుట్టు పక్కల ఆదివాసీ గూడేలలో నాలుగుకు పైగా బాల సంస్కార కేంద్రాలు నిర్వహించాను. తర్వాత 1987లో హైదరాబాద్‌కు వచ్చాం. ఇక్కడా వినాయక్ నగర్ లాంటి బస్తీలలో సేవా శిబిరాలు నిర్వహించాను. 'లా' చదివిన తర్వాత 1995లో హైకోర్టు న్యాయవాదిగా ప్రాక్టీసు మొదలుపెట్టా.

అంజనీ మాతా సేవా ట్రస్ట్ ద్వారా ఎంతోమంది పేదబాలికల చదువుకు సహాయం అందించాను. కొన్ని వందల ఫ్యామిలీ కేసులు ఉచితంగా వాదించాను. విడాకుల కోసం వచ్చిన ఎన్నో జంటలను కౌన్సెలింగ్ ద్వారా తిరిగి ఒక్కటి చేయగలిగాను.

**అవన్నీ అవాస్తవాలు...**

'ఆడవాళ్లను ఇంటికే పరిమితం చేయడం ఆర్ఎస్ఎస్ సిద్ధాంతమని, వారు స్త్రీ స్వేచ్ఛ, స్వాతంత్ర్యానికి వ్యతిరేకమనే దుష్ప్రచారాలు బయట బోలెడు వింటుంటాం. అవన్నీ పచ్చి అబద్ధాలు. మహిళాభ్యున్నతికి సంఘ్ వ్యతిరేకం అయితే, నేను ఇంతవరకు వచ్చేదాన్నా? కన్నవారిని, ఇంటిని వదిలి ఆర్ఎస్ఎస్ కోసం ఎంతోమంది అమ్మాయిలు ప్రచారికలుగా మారారు. అనేక రంగాలలో సమితి మహిళలు రాణిస్తున్నారు. అసలు సంఘ్ భావనలు స్త్రీ స్వేచ్ఛకు విరుద్ధమైతే, కర్ర పట్టుకొని వీధుల్లో తిరగం కదా! శాఖలు నిర్వహించం కదా! ధర్మపరిరక్షణ కోసం బయటకొచ్చి నిరసనలు, ధర్నాలు చేపట్టం కదా! స్త్రీలలోని నైపుణ్యాలు వెలికితీసి, తద్వారా సమాజ ప్రయోజనానికి ఉపయోగించాలన్నదే రాష్ట్ర సేవికా సమితి సంకల్పం. నేను ఎన్‌హెచ్ఆర్‌సీ సభ్యురాలిని అయ్యాక... సంఘ్ బాధ్యతల నుంచి పూర్తిగా బయట కొచ్చాను. ఈ దేశంలో భావజాలాలు ఎన్నున్నా దేశం విషయంలో పౌరులంతా సమానమే. పైగా ఇలాంటి బాధ్యతాయుతమైన పదవిని నిర్వర్తించే ప్పుడు భావజాలం ప్రధానం కాదు. ఎవరికి బాధ కలిగినా మేము స్పందిస్తాం. అంతకుమించి మతాలకు, సిద్ధాంతాలతో సంబంధంలేదు. సంస్కారవంతమైన సమాజం నిర్మాణం కావాలి. అందరికి సమన్యాయం జరగాలి. మానవు లంతా సంతోషంగా ఉండాలన్నదే నా కోరిక. ఆ లక్ష్యంతోనే పని చేస్తున్నాను."

*– ఆంధ్రజ్యోతి సౌజన్యంతో*

■

ఘర్షణను మనం ముగించకపోతే ఘర్షణ మనలను ముగిస్తుంది

# 'సేంద్రియ' కాంతులతో వెలుగుతున్న గ్రామం !



**అ**రకొర వానలు, ఏఏటికాయేడు పెరిగిపోతున్న వ్యవసాయ పెట్టుబడులు... ఆరుగాలం శ్రమించినా పంట చేతికి వస్తుందో రాదో తెలియని అనిశ్చితి... వీటికి తోడు ఎరువులు, పురుగుల మందుల వల్ల క్షీణిస్తున్న భూసారం... దీనికి సేంద్రియ పద్ధతులే పరిష్కారంగా గుర్తించిన నిబియా బేగంపూర్ గ్రామ మహిళలు దాన్ని ఆదాయ మార్గంగానూ మార్చుకున్నారు.

దేశంలోని అనేక కుగ్రామాల్లో ఉత్తరప్రదేశ్‌లోని బహ్రైచ్ జిల్లా నిబియా బేగంపూర్ ఒకటి. ఇప్పుడు ఆ పల్లెకు చెందిన మహిళల విజయగాథను ఎన్నో ప్రాంతాలు ఆసక్తిగా అధ్యయనం చేస్తున్నాయి.

సాధారణంగా మొదలైన ఒక చిన్న ప్రయత్నం అక్కడి మహిళలకు సాధికారతను, ఆర్థిక స్వావలంబనను కల్పించింది. దీనికి రెండేళ్ళ క్రితం బీజం పడింది. ఆ గ్రామానికి చెందిన రామ్ ప్యారీ అనే మహిళ ఒక స్వయం సహాయక బృందం సభ్యురాలు.

సేంద్రియ వ్యవసాయంపై గ్రామీణుల్లో అవగాహన కల్పించే ఒక కార్యక్రమంలో భాగంగా... మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ కేంద్రంగా పని చేస్తున్న 'అభినవ్ – ఎహెచ్‌ఆర్‌డిఓ' సంస్థను సందర్శించారు. 'అభినవ్' ఒక సేంద్రియ వ్యవసాయ కన్సల్టెన్సీ. అయిదువందలకు పైగా గ్రామాల్లో సుమారు లక్షమంది రైతులతో కలిసి పని చేస్తోంది. అక్కడే బయో–ఫెర్టిలైజర్ల తయారీ గురించి రామ్ ప్యారీ తెలుసుకున్నారు. రసాయనిక ఎరువులు, పురుగుల మందుల వల్ల రైతుల మీద అపారమైన ఆర్థికభారం పడడంతో పాటు... భూసారం క్షీణిస్తుందనీ, వాతావరణానికి కూడా అవి చేటు చేస్తాయనీ గ్రహించారు. తమ గ్రామానికి వచ్చిన తరువాత... స్థానిక మహిళలతో ఈ విషయాలను పంచుకున్నారు.

'అంతంత డబ్బు పోసి... హాని చేసే వాటిని కొనడం కన్నా మనమే తయారు చేసుకుంటే మంచిది కదా!' అని వారందరూ నిర్ణయించుకున్నారు. వాటి తయారీలో సాంకేతిక అంశాలు తెలుసుకోవడానికి 'అభినవ్' సంస్థ సభ్యుల సాయం తీసుకున్నారు.

ఆవు పేడతో బయో ఫెర్టిలైజర్, బయో పెస్టిసైడ్ ఎలా తయారు చెయ్యాలో నేర్చుకున్నారు. మొదట 22 మంది మహిళలు 'ఉన్నతి ఆర్గానిక్ యూనిట్' పేరుతో ఒక తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

**ఖర్చులేని ఉత్పాదన...**

"ఈ ఉత్పత్తులతయారీ కోసం ముడి పదార్థాలను కొనక్కర్లేదు. వెతకాల్సిన అవసరం లేదు. కాబట్టి ఉత్పాదనకు

నీ కలలు చెప్పేదేమిటో శ్రద్ధగా విను, అవి నీ కంటె చురుకైనవి, నీ కంటె తెలివైనవి

ఖర్చు ఉండదు. అన్నీ గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ దొరికేవే. ముందుగా మా గ్రూప్‌లో ఉన్న ప్రతి మహిళ ఇంటి దగ్గరా ఒక చతురస్రాకారపు గోతిని తవ్వించాం. అది దాదాపు 60 కిలోల ఆవు పేడను సేకరించడానికి సరిపోయేలా ఉంటుంది. ఆ పేడలో 200 గ్రాముల కోడి గుడ్డు పెంకులు లేదా సున్నం, 200 గ్రాముల మట్టి, రెండు మోతాదులు ఇతర సేంద్రియ పదార్థాలను కలుపుతాం. వాటివల్ల మట్టి సారం పెరుగుతుంది. ఈ మిశ్రమాన్ని మూడు నెలలపాటు అలాగే వదిలేస్తాం. అది ఎండిపోతుంది. ఆ ఎరువు మట్టిలో కలిసిపోవడానికి సిద్ధమవుతుంది. అరవై కిలోల ఆవు పేడతో పాతిక కిలోల ఎరువు సిద్ధమవుతుంది" అని వివరించారు బృందం సభ్యులు.

ఈ ఎరువుల ప్రయోజనం గురించి గ్రామంలోని రైతులకు చెప్పినా వారి నుంచి పెద్దగా స్పందన లేదు. ఎట్టకేలకు నరేంద్రకుమార్ అనే రైతు వాటిని కొని... తన



రెండెకరాల భూమిలో ఉపయోగించాడు. అప్పటివరకూ రెండున్నర క్వింటాళ్ళుగా ఉండే వరి దిగుబడి ఈ సేంద్రియ ఎరువుల వల్ల అయిదు క్వింటాళ్ళకి పెరిగింది. దాంతో మిగిలిన రైతులు కూడా వీటిని కొనడం ప్రారంభించారు. చుట్టుపక్కల గ్రామాల్లోనూ డిమాండ్ పెరగడంతో... మరికొందరు మహిళలు కూడా ముందుకువచ్చి శిక్షణ తీసుకున్నారు. నిబియా బేగంపూర్ గ్రామంతో పాటు, అక్కడికి పద్దెనిమిది కిలోమీటర్ల దూరంలోని బిచ్చాలా గ్రామంలో మరో యూనిట్ ఏర్పాటు చేశారు. ఈ యూనిట్లను 'బయో–ఇన్‌పుట్ రిసోర్స్ సెంటర్స్' (బిఆర్‌సి)గా వ్యవహరిస్తున్నారు.

ఈ కేంద్రాల్లో ఎరువులతోపాటు అల్లం, వెల్లుల్లి, నీరుల్లి, మిరప ముద్దతో క్రిమి సంహారకాన్ని తయారు చేస్తున్నారు. అలాగే మొక్కల సంరక్షణ కోసం రెండు రకాల పదార్థాలు కూడా ఉత్పత్తి అవుతున్నాయి. వీటిలో ఒకటి వేప తదితర విత్తనాల పొడిని గోమూత్రం నీటితో కలిపి చేసేది కాగా, మరొకటి ఆకుల సారంతో రూపొందుతుంది.

**ఆదాతో పాటు ఆరోగ్యం కూడా...**

ఈ మహిళల నిబద్ధతను గమనించిన 'అగాఖాన్ ఫౌండేషన్'... బిఆర్‌సి యునిట్ల నిర్మాణం, అభివృద్ధి కోసం 14 లక్షల రూపాయల సాయం అందించింది. "ఈ రెండు కేంద్రాల ద్వారా ఆరు వేలమందికి పైగా రైతులు సేంద్రియ ఉత్పత్తుల్ని కొనుగోలు చేస్తున్నారు. వాటి ధరలు కిలో అరవై నుంచి వంద రూపాయల లోపే ఉంటాయి. వీటి తయారీలో భాగస్వాములైన మహిళలకు మంచి ఆదాయం వస్తోంది. దీనితోపాటు కొన్ని ఇళ్ళలో బయోగ్యాస్ యూనిట్లు కూడా ఏర్పాటు చేసుకున్నాం. వంటకు బయోగ్యాసనే ఉపయోగి




స్తున్నాం, దీనివల్ల డబ్బు ఆదా అవుతోంది. ఆరోగ్యానికి కూడా ఇది మంచిది" అని చెప్పారు రామ్ ప్యారీ.

ఇప్పుడు పలు గ్రామాలవారు నిబియా బేగంపూర్‌ను సందర్శించి, వాటి తయారీలో మెళకువలు తెలుసు కుంటున్నారు. తమ ప్రాంతాల్లోనూ అమలు చేస్తున్నారు. "వ్యవసాయ ఖర్చులు తడిసిమోపడవుతున్న ప్రస్తుత కాలంలో... రైతుకు భారం తగ్గించి, నేల సారాన్ని పెంచే సేంద్రియ ఎరువులు, పురుగులమందుల తయారీని ప్రభుత్వాలు ప్రోత్సహించాలి. దానివల్ల మహిళలు కూడా ఆర్థికంగా నిలదొక్కుకుంటారు" అని చెబుతున్నారీ సేంద్రియ సారథులు. ■

వైఫల్యాన్ని ఒప్పుకోవడం కూడా సాహసమే, అయితే ఈ ఒప్పుకోలు సాఫల్యాన్ని అందుకునేదాకా ఆగరాదు

# ఎండాకాలంలో పెరుగు కంటె మజ్జిగ మేలు!

ప్రతి భారతీయ గృహంలో ఆహారంతో పెరుగు తినడం దాదాపు ప్రధానమైనది. పెరుగు శరీరాన్ని చల్లగా ఉంచుతుంది. అయితే, ఎండాకాలంలో శరీరాన్ని చల్లగా ఉంచుకోవడానికి పెరుగుతో తయారు చేసే మజ్జిగ మంచిదంటారు. ఆయుర్వేదం ప్రకారం, మజ్జిగ జీర్ణం కావడానికి తేలికగా ఉండటమే కాకుండా, అన్ని శరీర రకాలకు సరిపోతుంది. అయితే పెరుగు శరీరం వేడెక్కడం పై ప్రభావాన్ని చూపుతుందని నమ్ముతారు, అయితే మజ్జిగ చల్లబరుస్తుంది. అసలు ఈ రెంటిలో ఏది బెస్ట్..

**మజ్జిగ, పెరుగు ఆరోగ్య ప్రయోజనాలు..**



పెరుగును తినేటప్పుడు, అది కడుపు వేడితో సంకర్షణ చెందుతుంది. పులియడం అనే ప్రక్రియ త్వరగా జరుగుతుంది. ఇది శరీరాన్ని చల్లబరచ డానికి బదులుగా ఉష్ణోగ్రతను పెంచు తుంది. అయితే, మనం మజ్జిగ తాగినప్పుడు అదేం జరగదు. ఎందు కంటే పెరుగులో నీరు కలిపినప్పుడు, పులియడం ఆగిపోతుంది.

**1. జీర్ణక్రియలో సహాయపడుతుంది.**

పెరుగు, మజ్జిగ రెండూ గట్ బ్యాక్టీరియాను ఆరోగ్యంగా ఉంచే ప్రోబయోటిక్స్. మజ్జిగ ఈ రుచికరమైన, ఆరోగ్యకరమైన పానీయం ముఖ్యమైన ప్రోబయోటిక్స్, విటమిన్లు, ఖనిజాల పవర్‌హౌస్, ఇది తీవ్రమైన వేడిలో కూడా మన శరీర ఉష్ణోగ్రతను తక్కువగా ఉంచుతుంది. శక్తిని పునరుద్ధరించడానికి, శరీరాన్ని సహజంగా చల్లబరచడానికి ఒక గ్లాసు చల్లని మజ్జిగను తీసుకోవచ్చు.

**చిట్కా :** జీర్ణక్రియలో జీలకర్ర పొడి, ఉప్పు, కొత్తిమీర వంటి మసాలా దినుసులు కలిపిన మజ్జిగ జీర్ణ ప్రక్రియలో సహాయపడటానికి సహకరిస్తుంది.

**2. మజ్జిగ బరువు తగ్గడంలో సహాయపడుతుంది.**

బరువు తగ్గాలనుకుంటే, తక్కువ పెరుగుకు బదులు, మజ్జిగను తీసుకోవచ్చు.

**3. మజ్జిగ తాగడం వల్ల తేలికైన అనుభూతి కలుగుతుంది.**

పెరుగు వేడిగా ఉంటుంది, అదే పెరుగు నుపయోగించి చేసిన మజ్జిగ వేరే ప్రక్రియ ద్వారా వెళుతుంది చల్లగా ఉంటుంది. కాబట్టి, వేసవి కాలంలో పెరుగుకు దూరంగా ఉండి, బదులుగా మజ్జిగ తీసుకోవచ్చు.

**ఇతర ప్రయోజనాలు**

1. జీర్ణక్రియను సులభతరం చేయడం, నిర్జలీకరణాన్ని ఎదుర్కోవడమే కాకుండా, మజ్జిగ కొన్ని ఇతర ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది.
2. మసాలా భోజనం చేసిన తర్వాత చికాకు కలిగించే త్రేన్పుల నుంచి ఉపశమనానికి సహాయపడుతుంది.
3. మజ్జిగ భారీ భోజనంలో విని యోగించిన కొవ్వులను కరిగిస్తుంది.
4. కాల్షియం, లాక్టోస్ సహనం లేని వ్యక్తులు కూడా తీసుకోవచ్చు.
5. ఇందులో విటమిన్లు పుష్కలంగా ఉంటాయి కాబట్టి మీ శరీరానికి ఆరోగ్యకరం.
6. మజ్జిగలో ఉండే మిల్క్ ఫ్యాట్ గ్లోబుల్ మెంబ్రేన్‌లు అధిక రక్తపోటును అదుపులో ఉంచుతాయి. ఇది కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచే బయోయాక్టివ్ ప్రోటీన్ కూడా.
7. అదే గ్లోబుల్స్ కూడా యాంటీ వైరల్, యాంటీ బాక్టీరియల్, యాంటీ క్యాన్సర్.
8. మజ్జిగ యాసిడ్ రిఫ్లక్స్ కారణంగా కడుపు ఉపశమనానికి సహాయపడుతుంది, తద్వారా ఆమ్లతను ఎదుర్కోవడంలో సహాయపడుతుంది. ■

నీవు ఎంచుకున్న మార్గాలు ... ఆ దారులవెంట నీ నడక తీరు ... జీవితం అంటే ఇదే !

# లిల్లీ పూలతో లక్షలు సంపాదిస్తోంది!

**ఆ**మెకు పూలంటే ఇష్టం. కుండీల్లో పూలను పెంచటం భలే ఇష్టం. ఆ ఇష్టమే కాస్త వ్యాపారంగా మార్చుకుంది. తన పేరు విజి అబి. ఉండేది కేరళలో. అందరిలా కాకుండా వాటర్ లిల్లీలను పెంచుతోందీమె. నెలకు లక్ష రూపాయలను సంపాదిస్తూ తన పూల వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటోన్న విజి అబిని 'వాటరాఫ్ లిల్లీ' అని పిలుస్తున్నారిప్పుడు.

"నేనిప్పుడు నీళ్లలో పెరిగే లిల్లీ పూలను ఫేస్‌బుక్, ఇన్‌స్టా ద్వారా దేశంలోనే కాకుండా ఇతర దేశాలకూ అమ్ముతాను. నెలకు కనీసం లక్ష రూపాయల సంపాదన ఉంటుంది. పిల్లల కంటే ప్రేమగా ఈ పూలను పెంచాలి. అప్పుడే ఇందులో రాణించగలం. నా వరకు ఈ వాటర్ లిల్లీ పూల వ్యాపారం అంత సులువేమీ కాదు. అనుభవంతోనే పూల పెంపకాన్ని నేర్చుకున్నా.



**అలా పూల వ్యాపారంలోకి..**

ఎందుకో తెలీదు చిన్నప్పటి నుంచి గార్డెనింగ్ అంటే ఇష్టం. మల్లెపూలు, రోజా, గులాబీ పూలను పెంచేదాన్ని. ఏదో ఆసక్తితో ప్రతి ఆడపిల్ల పెంచినట్లే పూల మొక్కలను పెంచేదాన్ని. కుండీల్లో నీళ్లను పోయటం, మట్టి తీసుకురావటం.. పూలను గమనించటం చేసేదాన్ని. పెళ్లయ్యాక కూడా ఇంట్లో పూలను పెంచుకునేదాన్ని. మా అబ్బాయి పుట్టాక ఖాళీగా ఉండేదాన్ని. ఉద్యోగంలో మళ్లీ చేరదామనుకున్నా. ఆ సమయంలో ఇంట్లోనే ఉండి ఏదైనా చేయాలనుకున్నా. బాబును చూసు కుంటూ పూల మొక్కలు ఎక్కువగా ఇంట్లోనే పెంచాలను కున్నా. అందుకే ఉద్యోగానికి రాజీనామా చేశా.

లిల్లీ పూల పెంపకం బావుంటుందని తెలిసి ఐదేళ్ల కితం తొలి వాటర్ లిల్లీ మొక్కలను కొన్నా. కేరళలో త్రిశూర్ ప్రాంతంలోని వాతావరణానికి ఆ మొక్కలు బతకలేదు. దీంతో ఇక్కడ బతికే పూలేవీ అని ఇంటర్నెట్‌లో వెతికా. ఫేస్‌బుక్‌లో వాటర్ లిల్లీ పూల గురించి తెలిసింది. ఇంటర్నేషనల్ వాటర్ లిల్లీ గ్రూప్స్‌తో పాటు గార్డెనింగ్ గ్రూప్స్‌లో జాయిన్ అయ్యా. వారితో మాట్లాడటం, మెసేజుల్లో సలహాలు తీసుకునేదాన్ని. వాటర్ లిల్లీను పెంచా. మంచి గిరాకీ ఉండటంతో.. వాటర్ లిల్లీల పెంపకం పూర్తి స్థాయిలో చేయాలనుకున్నా.

**అందుకే సక్సెస్..**

మా ఇంట్లోవారి ప్రోత్సాహం ఉంది. దీనికి తోడు ఈ వాటర్ లిల్లీ పూల కోసం మంచి వాతావరణాన్ని క్రియేట్ చేశా. ఇంట్లో పనులు చేసుకుని, మా అబ్బాయిని బడికి పంపించి.. ఈ లిల్లీ పూల మొక్కలను ప్రాణంగా చూసుకునేదాన్ని. నాకంటూ ఓ కొత్త ప్రపంచాన్ని ఏర్పరచుకోవాలి. అందులో నేనే డైరక్టర్‌గా ఉండాలనుకుండేదాన్ని మనసులో. అలా ఈ వాటర్ లిల్లీ వ్యాపారంలో నిజమైంది. మంచి సక్సెస్ అందుకున్నా. ఇంటి వద్దకే కాదు.. ఆన్‌లైన్‌లో ఆర్డర్స్ పెరిగాయి. వంద రకాల వాటర్ లిల్లీ మొక్కలను పెంచుతాను. ఆర్గానిక్ ఫామింగ్ చేస్తాను.

దగ్గరుండి ఈ పని ప్రేమతో చేస్తాను కాబట్టే పూల గురించి ఎన్నో విషయాలు తెలిసాయి. విభిన్న పూలకోసం వెతకటం.. అంటు కట్టడం చేస్తుంటా. ఏ సీజన్‌లో ఏ పూలకు డిమాండ్ ఉంటే అక్కడకు సరఫరా చేస్తాను. అంతర్జాతీయ వాటర్ లిల్లీ మెంబర్స్ గుర్తించారు. కేరళలో అవార్డులు ఇచ్చారు. ప్రకృతికి మంచి చేసే ఈ పూల వ్యాపారం ఎవరైనా చేసుకోవచ్చని చెబుతా. నాకు తెలిసింది నేర్పిస్తా. విత్తనాలను, పూల మొక్కలను ఇస్తుంటా. నాలా ఈ వ్యాపారం ఇష్టం ఉండేవారికి నా వంతు సాయం చేస్తా. పూలంటే ఎవరికి ఇష్టం ఉండదు? నాకూ అంతే. అయితే కాస్త ఎక్కువ ఇష్టం. అందుకే పూల మనసును అర్థం చేసుకుని.. ఈ వాటర్ లిల్లీ పూలతో లక్షలు సంపాదిస్తున్నా."

**– ఏబీఎన్ సౌజన్యంతో**

■

శత్రువులు వున్నారంటే నీవు గట్టివాడివే ; జీవితంలో ఒక్కసారైనా నమ్మినదానికోసం నిలబడ్డావన్నమాట

# వ్యవసాయ సొసైటీలో స్వాహాపర్వం!

కొమరోలు విశాల వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ)లో భారీ కుంభకోణం చోటుచేసుకుంది. సొసైటీ నిధులు 80.26 లక్షల రూపాయలు స్వాహా అయ్యాయి. లావాదేవీల్లో అడుగడుగునా అక్రమాలు చోటు చేసుకున్నాయి.

వీటన్నింటికీ సి ఇ ఓ రావూరి దిలీప్‌కుమార్ కేంద్ర బిందువుగా నిలిచారు. సొసైటీ నిర్వహించిన ఎరువుల వ్యాపారంలో అక్రమాలు, శనగలు కొనుగోలు చేసి ఇష్టారాజ్యంగా బహిరంగ మార్కెట్‌లో విక్రయించడం, రుణాలకు సంబంధించి రైతుల నుంచి వసూలు చేసిన సొమ్మును బ్యాంకులో జమ చేయకుండా సొంతానికి వాడుకోవడంతోపాటు సూపర్ మార్కెట్ వ్యవహారం లోనూ నిధుల స్వాహా జరిగింది.

సొసైటీలో జరుగుతున్న అక్రమాలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. గిద్దలూరు సబ్ డివిజనల్ సహకారాధికారి చేపట్టిన విచారణలో నిధుల స్వాహా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీనిపై డి సి ఓ సమగ్ర విచారణకు ఆదేశించారు.

విచారణాధికారిగా పొదిలి సబ్ డివిజనల్ సహకారాధికారి కె.వెంకటేశ్వర్లును నియమించారు. దీన్ని అడ్డుకొనేందుకు సీఈవో చేయని ప్రయత్నాలు లేవు. రాజకీయంగా, న్యాయపరంగా చేసిన ప్రయత్నాలకు అడ్డుకట్టపడింది. విచారణ చేపట్టడంతో అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చింది. 80.26 లక్షల రూపాయలు దిగమింగినట్లు తేలింది.

**నేరస్తులపై చర్యలకు కలెక్టర్ ఆదేశం**

కొమరోలు విశాల వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ)లో జరిగిన నిధుల దుర్వినియోగం, పరిపాలనాపరమైన అక్రమాలపై కలెక్టర్ శ్రీ దినేష్‌కుమార్ కన్నెర్రచేశారు. సొసైటీలో జరిగిన 80.86లక్షల రూపాయలు నిధుల స్వాహా, ఇతర అవకతవకలకు, అక్రమాలకు బాధ్యులైన వారిపై క్రిమినల్ చర్యలకు ఆమోద ముద్ర వేశారు.

తొలుత సొసైటీలో జరిగిన ఆర్థిక అక్రమాలపై ఏపీ సహకార సంఘాల చట్టం 1964 సెక్షన్ 51 ప్రకారం చట్టబద్ధమైన విచారణకు డి సి ఓ శ్రీ రాజశేఖర్ ఆదేశించారు. విచారణాధికారిగా పొదిలి సబ్ డివిజనల్ సహకారాధికారి శ్రీ కె.వెంకటేశ్వర్లును నియమించారు. ఆయన విచారించి సొసైటీలో 80.86 లక్షల రూపాయలు స్వాహా నిజమేనని, పలు ఆర్థిక, పరిపాలనాపరమైన అవకతవకలు జరిగాయని తేల్చారు.

ఈ నిధుల స్వాహాకు సొసైటీ మాజీ సి ఇ ఓ రావూరి దిలీప్‌కుమార్, సొసైటీ మాజీ చైర్మన్ గజ్జలకొండ చినవెంకటేశ్వర్లు, అప్పటి పీడీసీసీ బ్యాంకు సూపర్‌వైజర్ షేక్ రహంతుల్లా, గిద్దలూరు పీడీసీసీ బ్యాంకు మేనేజర్ దేశెట్టి శ్రీనివాసులును బాధ్యులుగా తేల్చి నివేదికను సమర్పించారు.

దీంతో నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన ఈ నలుగురిపై ఏపీ సహకార సంఘాల చట్టం 1964 సెక్షన్ 79(1)(ఎ), 79(1)(ఎఫ్),79(3),(1) ప్రకారం క్రిమినల్ చర్యలకు అనుమతించాలని మార్కాపురం డివిజనల్ డిప్యూటీ రిజిస్ట్రార్ శ్రీ రాజశేఖర్ కలెక్టర్‌కు నివేదించారు.

వీటిని పరిశీలించిన కలెక్టర్ ఆ నలుగురిపై విచారణకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. బాధ్యులపై వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు మార్కాపురం డిప్యూటీ రిజిస్ట్రార్ శ్రీ రాజశేఖర్ ఈ నలుగురిపై కొమరోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఉత్తర్వుల నకళ్లను స్టేషన్ హౌస్ అధికారికి, మార్కాపురం డీఎస్పీకి అందజేశారు.

**అక్రమాల్లో మచ్చుకు కొన్ని.**

సొసైటీలో 41 మంది రైతుల నుంచి రూ.29.64 లక్షల రూపాయలు వసూలు చేసి ఆ మొత్తాన్ని నగదు పుస్తకాల్లో నమోదు చేయలేదు, బ్యాంకులో జమ చేయలేదు.

నీకు ఎందుకూ ఉపయోగపడని వారితో వ్యవహరించే తీరు నీ వ్యక్తిత్వానికి ఒక కొలమానం

బకాయిలు చెల్లించిన రైతులకు సొసైటీ రసీదులు ఇవ్వకుండా తెల్లకాగితం మీద స్టాంపులు అంటించి ఇచ్చారు.

రైతులు రెండోసారి చెల్లించిన బకాయిలు రూ. 8.75 లక్షల రూపాయలను కూడా సొసైటీ నగదు పుస్తకంలో రాయలేదు, బ్యాంకులో జమ చేయలేదు.

రైతుల వ్యవసాయ రుణాలకు సంబంధించి వడ్డీ చెల్లింపు కోసం వసూలు చేసిన రూ. 1.78 లక్షల రూపాయలు సొంతానికి వాడుకున్నారు.

సొసైటీ ద్వారా కొనుగోలు చేసిన శనగల విక్రయంలో కూడా గోల్‌మాల్ జరిగింది. రైతుల నుంచి కొనుగోలు చేసిన శనగలు నేరుగా మార్క్‌ఫెడ్‌కు విక్రయించకుండా కొన్ని బహిరంగ మార్కెట్‌లో అమ్ముకొని ఆ మొత్తాలు రైతులకు చెల్లించకుండా దిగమింగారు. రైతులు ఒత్తిడి చేయడంతో సి ఇ ఓ వారికి చెక్కులు ఇవ్వగా అవి బౌన్స్ అయ్యాయి. ఈవిధంగా రూ. 7.24 లక్షల రూపాయలు గల్లంతయ్యాయి.

మార్క్‌ఫెడ్ నుంచి రూ. 15.55 లక్షల విలువైన ఎరువులు కొనుగోలుచేసి వాటిలో కొన్ని అసలు సొసైటీకి చేరకుండానే బయట విక్రయించారు. దీనికి సంబంధించి మార్క్‌ఫెడ్‌కు రూ. 2.50 లక్షల రూపాయలు జమ చేశారు. ఈ వ్యాపారంలో 2.52 లక్షల రూపాయలు స్వాహా అయ్యాయి. ఇంకా సొసైటీలో నిల్వవున్న నగదులో 4.49 లక్షల రూపాయలు సొంతానికి వాడుకున్నారు.

సొసైటీ అధ్వర్యంలో నిర్వహించిన సూపర్ మార్కెట్ లావాదేవీల్లోనూ లక్షల రూపాయలు అక్రమాలకు పాల్పడినట్టు తేలింది. సూపర్ బజారు సరుకుల నిల్వలో తేడా చూపించి, 5.49 లక్షల రూపాయల సరుకులు బయటి వ్యక్తులకు విక్రయించి, రూ. 3.50 లక్షల రూపాయలు సొసైటీకి జమ చేయలేదు.

సూపర్ మార్కెట్ రూము రెంటు రెండు లక్షలు, రెంట్ అడ్వాన్స్ రూ. 1.50 లక్షలు కూడా స్వాహా చేశారు.

సొసైటీకి జమ అయిన మొత్తాలను ఖర్చుగా చూపించి రూ. 46,260 సొంతానికి వాడుకున్నారు.

పాలకవర్గం అనుమతి లేకుండా, జీతాల పే బిల్లుల ఎంట్రీలు లేకుండా 2 లక్షల 46 వేల రూపాయలు డ్రా చేసి వాడుకున్నారు.

సొసైటీకి తనఖా పెట్టిన 26,842 బాండ్లు వాయిదా, గడువు మీరిపోవడంతో సంస్థకు నష్టం వాటిల్లింది.

**దుర్వినియోగం వాస్తవమే**

కొమరోలు సొసైటీలో జరిగిన కుంభకోణంపై జిల్లా సహకారాధికారి పోలిశెట్టి రాజశేఖర్‌ను వివరణ కోరగా అక్కడ నిధుల దుర్వినియోగం వాస్తవమేనని ధ్రువీకరించారు. తగు చర్యలు తీసుకోవాలని మార్కాపురం డివిజనల్ సహకారాధికారిని ఆదేశించినట్లు చెప్పారు. నిధులను సంబంధిత వ్యక్తులనుంచి రాబట్టేందుకు చర్యలు తీసుకుంటామని రాజశేఖర్ తెలిపారు. ■

## రెండో పెళ్లికి రూ. 2 లక్షలు!

**భర్త** చనిపోయిన చాలామంది ఆడవాళ్ళు రెండో పెళ్లికి అస్సలు ఇష్టపడరు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఒంటరిగానే పిల్లల్ని పెంచి పెద్ద చేస్తుంటారు. ఈ క్రమంలో తమ సుఖసంతోషాల గురించి ఎంత మాత్రం పట్టించుకోరు. పైగా సమాజం కూడా కొన్ని కట్టుబాట్ల పేరుతో రెండో పెళ్ళిని చిన్నచూపు చూస్తుంది.

అలాంటి మహిళలకు భరోసా కల్పించాలనుకుంటున్న ఝార్ఖండ్ ప్రభుత్వం 'విధ్వ పునర్వివాహ్ ప్రోత్సాహన్ యోజన' పేరుతో వితంతువులు రెండో పెళ్లి చేసుకునేలా ప్రోత్సహిస్తోంది.

పెళ్లి చేసుకుని ఆ సర్టిఫికెట్‌నీ, చనిపోయిన భర్త మరణధ్రువీకరణ పత్రాన్నీ సమర్పిస్తే– వారి ఖాతాలో రెండు లక్షల రూపాయలు జమ చేస్తోంది.

అయితే ఈ పత్రాలను వెళ్లిన ఏడాదిలోపే సమర్పించాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగులకీ, పెన్షన్లు తీసుకునేవారికీ ఈ పథకం వర్తించదు. ఏ అండా లేనివారిని ఆదుకోవాలనే ఈ నిర్ణయం. ■

# ఈ ఆవు ఖరీదెంతో తెలుసా ? రూ. 40 కోట్లు !

## ఈ నెల్లూరు జాతి ఆవు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ఆవుగా రికార్డ్!

సాధారణంగా ఒక ఆవు ధర ఎంత ఉంటుంది ? ఒక లక్ష రూపాయల వరకు వుండవచ్చు. అదే మేలు జాతికి చెందిన ఆవులు అయితే రూ. 5 లక్షల వరకు పలుకుతాయి. ఇక మన తెలుగు రాష్ట్రాల్లోని ఒంగోలు, నెల్లూరు జిల్లాల్లో ఉండే కొన్ని రకాల ఆవులు ప్రపంచ వ్యాప్తంగా చాలా పేరు పొందాయి. అలాంటి ఓ నెల్లూరు ఆవు భారీ ధర పలికింది. ఏకంగా రూ.40 కోట్లకు అమ్ముడుపోయి ఔరా అనిపించిన ఈ నెల్లూరు ఆవును బ్రెజిల్‌లో విక్రయించడం గమనార్హం.



మన ఒంగోలు, నెల్లూరు మేలు జాతికి చెందిన ఆవులకు బాగా డిమాండ్ ఉంటుంది. ఇలా మన భారతదేశంలో ప్రసిద్ధి చెందిన ఈమేలుజాతి ఆవులు ఇప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షించాయి. దీనికి కారణం ఇటీవల బ్రెజిల్‌లో జరిగిన ఓ వేలంలో నెల్లూరు జాతికి చెందిన ఓ ఆవు ఏకంగా రూ.40 కోట్లు పలకడమే.

దీంతో మనదేశానికి చెందిన ఈ మేలుజాతి ఆవు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ఆవుగా మారింది. వయాటినా–19 ఎఫ్ఐవీ మారా ఇమోవిస్ అని పిలవబడే నెల్లూరు జాతికి చెందిన ఆవు ఏకంగా 4.8 మిలియన్ అమెరికన్ డాలర్లకు (సుమారు రూ.40 కోట్లు) అమ్ముడుపోయింది.

ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరు జిల్లాకు చెందిన ఈ మేలురకపు ఆవులను 1868లోనే బ్రెజిల్‌కు తరలించడం జరిగింది. ఆ తర్వాత ఈ రకపు జాతి ఆవులు ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి.

ఇక ఈ జాతికి చెందిన ఆవులు ఒక్క బ్రెజిల్ దేశం లోనే 16 మిలియన్ల వరకు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. తెలుపు రంగులో ఉండి, చూడటానికి బలిష్టంగా కనిపించే ఈ మేలురకపు ఆవులు వేడి ప్రదేశాలలోనూ ఇమిడిపోగలవు. అంతేగాక వీటిలో వ్యాధి నిరోధక శక్తికూడా అధికంగానే ఉంటుంది. కాగా, ఈ జాతి ఆవు శాస్త్రీయ నామం 'బోస్ ఇండికస్'.

■

ఒకరిని అంచనావేయడం వల్ల వారెలాంటివారో తెలిసే కంటె నీవెలాంటివాడివో నీకు తెలుస్తుంది

# జీవనోపాధుల బలోపేతం


ప్రత్యామ్నాయ పంటల సాగు పద్ధతులు...
చిన్న, సన్నకారు రైతులకు అదనపు ఆదాయ మార్గాలు

## చేపట్టే పనులు

డైరీఫాం, పౌల్ట్రి

పందిళ్ళపై కూరగాయల సాగు

బహుళ పంటల సాగు




పెరట్లో కూరగాయల పెంపకం

చిరు ధాన్యాల సాగు

చిరు ధాన్యాల ప్రాసెసింగ్

NABARD

MAHILA SADHIKARATHA
Publication Date: 01-04-2024 ; Posting Date: 05 & 06-04-2024
RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2024-26



మహిళా వ్యాపారవేత్తల ప్రోత్సాహక పథకం ప్రారంభం




దహెగోన్ మహిళా ఎఫ్ పి సికి నాబార్డ్ పురస్కారం !







మహిళా దినోత్సవాలు : హైదరాబాదులో పట్టణ పోషణ పథకంచే ... నల్లమడలో ... ధరణి ఎఫ్ పి ఓలో ...





వి కోటలో టమాట సాగు, పంట యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సు







ప్రపంచ నీటి దినోత్సవం : భువనగిరి లో ... మెదక్ లో ... ఖానాపూర్‌లో ' వాష్ ' అవగాన కార్యక్రమం

To ADDRESS



రిలయన్స్ ఎఫ్ పి ఓ – సి ఇ ఓలకు శిక్షణ

బట్వాడా కాకపోతే దయచేసి ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089